


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 62 | మంగళవారం 03 - 03 -2026 | పేజీలు : 12 | వెల-3



## కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు

**బాంబు దాడిలో ధ్వంసమైన గాంధీ ఆస్పత్రి**

**165కు చేరుకున్న పాఠశాల దాడి మృతులు**

అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఉత్తర టెహ్రాన్‌లో ఉన్న గాంధీ హాస్పిటల్ పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడిలో భవనం చాలా వరకు దెబ్బతింది. బాంబుల తాకిడికి కిటికీలు పగిలిపోయి, వార్డుల నిండా శిథిలాలు పేరుకుపోయాయి.

## ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి



**ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి**

**బాణాసంచా ప్రమాదంపై శివకాశీకి వెళ్ల స్టడీ**

**అధికారులకు సీఎం చంద్రబాబు సూచన**

2లో

## వైసీపీ మోసాలు మూసీవేత!

**నాటి అక్రమాలు అటకెక్కించడమే లక్ష్యం**

**జగనన్న ఇళ్ల మెటీరియల్‌లో భారీ మోసం**

**నాటి నేతలు, అధికారుల కుమ్మక్కే కారణం**

**స్పష్టంగా చెప్పిన విజిలెన్స్ విచారణ నివేదిక**

**తాజాగా జిల్లాల్లో గోదాముల మూసివేతకు హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ సర్క్యులర్**

**వేల టన్నుల స్టీలు, సామగ్రి ఖాళీకి ఆదేశం**

**సీఎం చర్యల పేరిట మొత్తానికే 'మాయ'**

**మరి దోచిన సొమ్ము, విచారణ సంగతేంటి?**



వైసీపీ హయాంలో జగనన్న ఇళ్ల పేరుతో జరిగిన మోసాలను 'మూసివేత' దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఆయా అక్రమాలపై విజిలెన్స్ నివేదిక ఉన్నప్పటికీ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న హౌసింగ్ గోదాముల్లో తుప్పుపట్టిపోయిన 16 వేల టన్నులకు పైగా స్టీలును తీసేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ పి. అరుణ్‌బాబు ఆదేశించారు. అదేవిధంగా చాలాకాలంగా వినియోగించకపోవడంతో బండరాళ్లుగా మారిన 8 వేల టన్నుల సిమెంట్, ఎందుకూ పనికిరాకుండా పాడైపోతున్న రూ.వందల కోట్ల విలువైన ఇతర గృహోపకరణ వస్తువులను గోదాముల నుంచి ఖాళీ చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాల్లోని హౌసింగ్ అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు.

2లో



## నా పరువు తీశారు

**బీఆర్ నాయుడుతో వీడియోలో ఉంది నేను కాదు**

**పోలీసులకు తెనాలి మహిళ ఫిర్యాదు**

అసలు పరిచయమే లేని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో వివాహేతర సంబంధం ఉందంటూ వైసీపీ సోషల్ మీడియా తన పరువు తీసిందని జెట్టి రేణుక అనే మహిళ గుంటూరు జిల్లా తెనాలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ నాయుడుతో ఆ వీడియోలో కనిపించిన మహిళ వేరే కాగా, అది తానేనంటూ వైసీసీ సోషల్ మీడియా కావాలనే తన ఫొటోను విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. "ఆయన నాకు రూ. 20 లక్షలు విలువ చేసే కారు కొనిచ్చారని, అది చాలక రూ. 5 కోట్లు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నానని వైసీపీ సోషల్ ప్రచారం చేస్తోంది" అని తన ఫిర్యాదులో ఆమె ఆరోపించారు. అశోక్ వైసీపీ జగన్, కుమార్ వైసీపీ పాలకొల్లు, షేక్ సయ్యద్ అనే మూడు ఫేస్‌బుక్ ఖాతాల ద్వారా తనపై అసత్య ప్రచారం

## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల



2లో

**క్షేమంగానే ఉన్నట్లు సమాచారం**

ఇరాన్-ఇజ్రాయెల్ మద్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు.





## రూ. 600ల కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ

హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన హైడ్రా మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. ఐటీ కారిడార్‌కు ఆనుకుని ఉన్న గంధంగూడ ప్రాంతంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెర నుంచి విడిపించింది. సుమారు రూ.600 కోట్ల విలువ చేసే 6.30 ఎకరాల స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 86/పి లో ఉన్న 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలోనే జలమండలికి కేటాయించింది. అయితే, ఈ విలువైన స్థలంపై కన్నేసిన కొందరు అక్రమార్కులు రకరకాల పేర్లతో ఆక్రమణలకు పాల్పడుతూ వచ్చారు. అంతేకాకుండా, ఆ స్థలంలో అనధికారికంగా షెడ్లను కూడా నిర్మించి కబ్జా చేశారు. ఈ విషయంపై జలమండలి అధికారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పక్కాగా సర్వే నిర్వహించింది. ఇది ప్రభుత్వ భూమేనని నిర్ధారించుకున్న అనంతరం, అక్కడ వెలసిన అక్రమ నిర్మాణాలను, షెడ్లను అధికారులు కూల్చివేశారు. ఆక్రమణలన్నీ తొలగించిన తర్వాత మొత్తం 6.30 ఎకరాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

**గంధంగూడలో 6.30 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న హైడ్రా**

**ఐటీ కారిడార్ సమీపంలో రూ.600 కోట్ల విలువైన భూమి రక్షణ**

**జలమండలికి కేటాయించిన స్థలంలో షెడ్ల తొలగింపు**

**ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసిన అధికారులు**

**సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం గతంలోనే స్థల కేటాయింపు**

2లో

## ఇరాన్‌పై యుద్ధం...

**ట్రంప్ నిర్ణయంతో అమెరికాలో రాజకీయ దుమారం**

**ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులు**

**దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి**

**కాంగ్రెస్ ఆమోదం లేకుండానే ట్రంప్ నిర్ణయం**

**ట్రంప్ పై సెనేటర్ల విమర్శలు**

2లో



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న సంచలన నిర్ణయంతో మధ్యప్రాచ్యం ఒక్కసారిగా భగ్గుమంది. ఇరాన్‌లో పాలన మార్పు లక్ష్యంగా ఆ దేశంపై భారీ సైనిక దాడులకు ట్రంప్ ఆదేశించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన ఈ భీకర దాడుల్లో ఇరాన్ సర్వోన్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ సహా పలువురు ఉన్నతాధికారులు మరణించారు. ఈ పరిణామంతో ఆగ్రహించిన ఇరాన్ తక్షణమే ప్రతీకార దాడులకు దిగడంతో మధ్యప్రాచ్యంలో పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది.

ఇరాన్ దాడుల్లో ఇప్పటికే ముగ్గురు అమెరికా సైనికులు మరణించినట్లు సమాచారం.

## ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు సిద్ధం



**అనంతగిరి హిల్స్‌లో జరిగిన శిక్షణా తరగతుల సమావేశంలో రాహుల్ గాంధీ**

**కాంగ్రెస్ విధానం అహింస, బీజేపీది హింసా విధానమని విమర్శ**

2లో

**ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారన్న రాహుల్ గాంధీ**

## ఏఐ సృష్టించిన నకిలీ తీర్పులు..

**ట్రయల్ కోర్టులపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**ఏఐ సృష్టించిన నకిలీ తీర్పులను ప్రామాణికంగా తీసుకున్న ట్రయల్ కోర్టు**

**ఇది కేవలం పొరపాటు కాదు మిస్‌కాండక్ట్ అని సుప్రీం వ్యాఖ్య**

**ఏపీ హైకోర్టు పరిధిలోని ఆస్తి తగాదా కేసులో వెలుగు చూసిన ఘటన**

**అటార్నీ జనరల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ**

2లో

**తదుపరి విచారణ మార్చి 10కి వాయిదా**



ఉనికిలో లేని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సృష్టించిన నకిలీ తీర్పులను ప్రామాణికంగా తీసుకుని ఒక సివిల్ కేసులో ట్రయల్ కోర్టు వ్యవహరించిన తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కేవలం నిర్ణయం తీసుకోవడంలో జరిగిన పొరపాటు కాదని, న్యాయమూర్తుల ప్రవర్తనా

## రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన



2లో

**నేలపాడులో నిర్మాణాల పరిశీలన**

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ ఆందోళన

2లో



**భారత్ ఎప్పుడూ శాంతికి కట్టుబడి ఉంటుందన్న మోదీ**

**దౌత్యం, చర్చల ద్వారానే పరిష్కారం కనుగొనాలనేది మన దేశ విధానమని వ్యాఖ్య**

**పశ్చిమాసియా దేశాలలో ఉన్న మన పౌరుల భద్రతపై కేంద్ర అప్రమత్తంగా ఉందన్న ప్రధాని**

# వైసీపీ మోసాలు ‘మూసివేత’!

ఈ నెలాఖరులోపు గోడౌన్లలోని స్టాక్ను క్లియర్ చేయకపోతే సంబంధిత ఏఈ, డీఈ, ఈఈ, డీహెచ్హెచ్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోదాములు ఖాళీ చేసే ప్రక్రియలో పురోగతిని ప్రతి రోజూ హౌసింగ్ హెడ్ ఆఫీసుకు రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. “కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ‘స్పర్శ్’ విధానం అమల్లోకి వచ్చినందున పేదల ఇళ్లకు సంబంధించిన బిల్లుల డబ్బులు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ అవుతాయి. కాబట్టి ఇక మీదట పేదల ఇళ్ల నిర్మాణం కోసం స్టీలు, సిమెంట్, ఇతర సామగ్రిని సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ విధానంలో హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ద్వారా కొనుగోలు చేయడం సాధ్యం కాదు. ఈనెల 1 నుంచి ‘ఏపీ నిర్మాణ్ పోర్టల్’ ద్వారా జిల్లాల్లో సిమెంట్ సేకరించకూడదు. కాబట్టి ప్రస్తు తం అన్ని జిల్లాల్లోనూ గొదాముల్లో పాడైపోతున్న ఆ స్టాక్ మొత్తం ఖాళీ చేసేసి గోదాములను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు.” అని ఎండీ అరుణ్బాబు జారీ చేసిన సర్క్యులర్లో పేర్కొన్నారు.

**చర్యల మాటేంటి?** గత జగన్ ప్రభుత్వం చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు, గృహనిర్మాణశాఖ అధికారులు కుమ్మక్కై భారీ కుంభకోణాలు, అవినీతికి పాల్పడ్డారు. ఈ అక్రమాలను నిగ్గు తేలుస్తూ విజిలెన్స్ విభాగం ప్రభుత్వానికి ఇటీవల ప్రాథమిక నివేదిక సమర్పించింది. దీనిపై దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు ఇటీవల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ, తాజాగా నాటి అక్రమాల ఆనవాళ్లు కనబడకుండా చెరిపేసి.. ప్రభుత్వం తీసుకునే చర్యల నుంచి తప్పించుకునేందుకు గృహనిర్మాణశాఖ అధికారులు గోదాములను ఖాళీ చేయాలని చూడడం చర్చగా మారింది. ఇక, జిల్లాల్లోని గోదాముల్లో నిల్వ చేసిన స్టాకు చాలావరకు కనిపించడం లేదని నివేదిక పేర్కొంది. సిమెంట్ స్టాకుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించకుండా నిల్వలను పక్కదారి పట్టించారని పేర్కొంది. వాటికి సంబంధించిన రసీదులు, వే బిల్లులు, కూపన్ల స్టాక్ ఫైల్స్ గోడౌన్ల ఇన్చార్జిల దగ్గర లేవని పేర్కొంది.

**ఆనవాళ్లు లేకుండా చేసేందుకే!** విజిలెన్స్ నివేదికలోని వాస్తవాలపై విచారణ లేకుండా.. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాల ఆనవాళ్లు లేకుండా చేసేందుకే ఇప్పుడు హౌసింగ్ ఉన్నతాధికారులు గోదాములను ఖాళీ చేయించే ప్రక్రియ కు శ్రీకారంచుట్టారనేవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**భారతీ సిమెంట్స్కు 165 కోట్లు** పేదల ఇళ్ల నిర్మాణం పేరిట భారతీ సిమెంట్స్ నుంచి పరిమితికి మించి ఏకంగా 3,31,528 టన్నుల సిమెంట్ కొనుగోలు చేసి.. నాటి ప్రభుత్వ అధినేత జగన్ కుటుంబానికి రూ.165 కోట్లు చెల్లించారని నివేదిక తెలిపింది. భారతీ సిమెంట్స్ కన్నా ఎక్కువ ప్లాంట్ సామర్థ్యం అర్హత ఉన్న అల్ట్రా టెక్, రామ్కో, మై హోం, పెన్నా, సాగర్, జువారీ కంపెనీలతో పాటు కేసీపీ, జేఎసడబ్ల్యూ, రెయిన్, పరాశక్తి, భవ్య, ఎన్సీఎల్, శ్రీచక్ర, శ్రీజయ జ్యోతి సిమెంట్ కంపెనీలకు మాత్రం తక్కువ కొనుగోళ్ల ఆర్డర్లు ఇచ్చారని తెలిపింది. మొత్తంగా 18 సిమెంట్ కంపెనీలకు రూ.1,143.11 కోట్లు చెల్లించారు. ఇలా సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ విధానంలో సేకరించిన 22,64,855 టన్నుల సిమెంట్ను అన్ని జిల్లాల్లో గోదాముల్లో నిల్వ చేశారు. అదే తరహాలో సేకరించిన స్టీలు, ఇతర మెటీరియల్స్ కొనుగోలులో వందల రూ.కోట్లు దోచిపెట్టారు.

**ఉన్నతాధికారుల పాత్ర** గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలన్నింటిలో అప్పటి హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల పాత్ర ఉందని, నాటి వైసీపీ నాయకులతో కుమ్మక్కయ్యారని విజిలెన్స్ నివేదక స్పష్టం చేసింది. అంతేకాదు,

తమ ముందస్తు ప్రణాళికలో భాగంగానే నిబంధనలకు విరుద్ధంగా సెంట్ర ల్ ప్రొక్యూర్మెంట్ విధానాన్ని తెరమీదకు తెచ్చారని తెలిపింది. ఈ క్రమంలో 3.51 లక్షల ఆప్షన్-3 ఇళ్ల లబ్ధిదారులకు తెలియకుండా లక్షలాది టన్నుల సిమెంట్, ఇనుము, ఇతర మెటీరియల్స్ను ఒకేసారి కొనుగోలు చేశారని నివేదిక వెల్లడించింది. తద్వారా రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్టు పేర్కొంది. పైగా గత ప్రభుత్వ పెద్దలకు కావలసినవారి సిమెంట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసం ఇంత భారీస్థాయిలో నిధులను దుర్వినియోగం చేశారని తెలిపింది. దీని వెనుక బంధుప్రీతి, రాజకీయ కుట్ర ఉన్నట్లుగా పరిగణించవచ్చని విజిలెన్స్ వెల్లడించింది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ ఆందోళన

పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో కెనడా ప్రధాని మార్క్ కార్నీతో జరిపిన ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన ఉమ్మడి మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఎప్పుడూ శాంతి, స్థిరత్వానికి కట్టుబడి ఉంటుందని, ఎలాంటి వివాదాలకైనా దౌత్యం, చర్చల ద్వారానే పరిష్కారం కనుగొనాలన్నది మన దేశ చిరకాల విధానమని ఆయన గుర్తుచేశారు. యుద్ధం ఏ సమస్యకు పరిష్కారం కాదని, ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో సంయమనం పాటించాలని కోరారు. ముఖ్యంగా పశ్చిమాసియా దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని మోదీ తెలిపారు. అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, భారత పౌరుల క్షేమం కోసం ఆయా దేశాల ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు.

# అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం

అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకో వడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదిరిస్తోంది. భారత్ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్ను తుదముట్టిం చింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్దంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్ఘాన్తోఓ కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్వర్క్ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన ’బంకర్ బస్టర్’ బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్తో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే- ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం.

# నీవు ఎవరు

64లక్షల జీవకణాలు అత్యంత వేగంగా తల్లిలోకి ప్రవేశిస్తే అందులో ఒకేఒక్క జీవకణం మాత్రమే గర్భంలోకి ప్రవేశిస్తుంది. అదికూడా మొండాన్ని కోల్పోయి శిరస్సుతో మాత్రమే ప్రవేశిస్తుంది. ప్రవేశించిన తరువాత కేవలం 24గంటల్లో అండాన్ని పట్టుకొని బ్రతకకపోతే ముక్కలై బయటికి వచ్చేస్తుంది. అదొక పోరాటమే. ఆ పోరాటం నీకు దేవుడిచ్చిన సమయం కేవలం 24గంటలు మాత్రమే. నిలిచావా బ్రతుకుతావు. లేదా ముక్కలై బయటికి వచ్చేస్తావ్..

అలా రూపం లేకుండా వెళ్లిన కణం రూపాంతరం చెంది రూపంతో బయటికి వస్తుంది. రూపాన్ని పొందుతుంది. కాళ్ళు చేతులు కదపలేని, నోటితో చెప్పలేని స్థితి. ఏమి చేసినా భరించాలి. క్రమంగా దేహం పెరుగుతుంది. దేహం మీద మోహం పెరుగుతుంది.

ఈ దేహం నేనె అంటాం. కానీ ఎలా?

లినీ దేహంలో ఏ భాగం నీ మాట వింటుంది?

ఏ భాగము వినదులి

వినాలి అని ప్రయత్నిస్తే మొదటికే మోసం వస్తుంది

చిన్నప్పుడు 2 అడుగులుగా ఉన్న దేహం క్రమంగా పెరుగుతూ 6అడుగులు అవుతుంది

అందంగా మారుతుంది. క్రమంగా అందం మందమై ముదిరిపోయి ముడతలు పడి, ఒక్కొక్క అవయవం క్రమంగా వేగాన్ని తగ్గించుకొని పనిచేయడానికి మొరాయిస్తాయి.

ఈ దేహం నీదే కదా! ఎందుకు మొరాయిస్తుంది?

ఈ దేహం నీదేకదా! ఎందుకు ఒకప్పుడు ఉన్న రూపం ఈరోజు లేదు?

ఈదేహం నీదేకదా! ఎందుకు నీమాట వినడంలేదు?

ఈదేహం నీదేకదా! ఎందుకు వదిలేసి వెళ్లిపోతున్నావ్?

ఎందుకంటే ఈ దేహం నీది కాదు. లినీకు ఆ దేవుడిచ్చిన ఇచ్చిన ఉపకరణం మాత్రమే

ఆ ఉపకరణాన్ని మనం జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి తప్ప ఈదేహం నాదే. నేను శాశ్వతంగా ఉండిపోతాను అనే భ్రమకి లొంగకూడదు ఏ కారణం చేత వచ్చామో తెలియనప్పుడు నీకున్న బాధ్యతలు నువ్వు సక్రమంగా నిర్వర్తించు. శాస్త్రాలు ఏమి చెప్పాయో వాటిని అనుసరించు. ఈ సృష్టి పరమాత్మదని తెలుసుకొ.. రూపం లేకుండా తల్లి గర్భంలోకి ప్రవేశించాం. రూపం పొంది ఎన్నో కార్యాలు చేసి ఉండవచ్చు. చివరికి రూపం ధరించిన రూపం ఇక్కడే వెళ్ళిపోతాం. ఇక్కడ ఉన్నది నువ్వు కాదు. నీకు పరమాత్మ ఇచ్చిన ఉపకరణం మాత్రమే అనే యధార్థం తెలుసుకుంటే ఎన్నో సమస్యలు పరిష్కారం అవుతాయి. రూపానికి ముందు నువ్వున్నావు. రూపంలో నువ్వున్నావ్. రూపం వదిలేశాకా నువ్వుంటావు.

ఎక్కడో ఓ చోట నువ్వు అనేవాడివి లేకపోతె అసలు రూపమే ఉండదు

ఈ దేహం దేవుడిచ్చిన ఒ అద్భుత వరం. ఆయనే ఆ దేహానికి ఏమి కావాలో ఇస్తాడు. ఆయనే తాయారు చేశాడు. ఆయనే సమయం అవ్వగానే నాశనం చేస్తాడు. ఈ దేహంలో ఉన్నంత కాలం జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ దేహాన్ని ఇష్టం వచ్చినట్లు చేయడానికి అధికారం లేదు. ఈ దేహంలో ఉన్న అన్ని భాగాలూ అయన అజ్ఞ ప్రకారమే నడుస్తున్నాయి, అయన ఆగమన్నప్పుడు ఆగిపోతాయి.




కాబట్టి ఆ నువ్వు ఎవరో తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్

**సేకరణ: పెరుమాళ్ళ వెంకట సురేంద్ర (రుద్రవరం ప్రతినిధి)**

## కువైట్లో కూలిన అమెరికన్ ఫైటర్ జెట్ తామే కూల్చామని ఇరాన్ ప్రకటన

అమెరికా సైనిక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ తెలిపింది. అమెరికా ఎఫ్-15 యుద్ధ విమానం కువైట్ గగనతలంలో కూలిపోయింది. విమానం కూలిపోయే ముందు పైలట్ విమానంలో నుండి బయటకు వెళ్లాడని అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది. పైలట్ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు విడుదలయ్యాయి. విమానం మంటల్లో చిక్కుకుని పడిపోతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఇరాన్ ఒకేసారి ఇజ్రాయిల్, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణులను ప్రయోగించడం ద్వారా తన దాడులను కొనసాగిస్తోంది. కువైట్ ఇంటిగ్రేటెడ్ పెట్రోలియం ఇండస్ట్రీస్ కంపెనీ సోమవారం విమానం శిథిలాలు మినా అల్ అహ్మది శుద్ధి కర్మాగారంలోకి పడ్డాయని ధృవీకరించింది. ఇద్దరు కార్మికులు గాయపడ్డారని కిపిక్ తెలిపింది. ఈ ప్రాంతంలో మోహరించిన ఎంఐఎం-104 పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ ద్వారా విమానం ప్రమాదవశాత్తూ కూలిపోయిందని అనుమానిస్తున్నారు. పేట్రియాట్ అనేది బాలిస్టిక్ క్షిపణులు, శత్రు విమానాలను కూల్చివేసేందుకు సాధారణంగా ఉపయోగించే అధునాతన వ్యవస్థ. ఇజ్రాయెల్తో పాటు అమెరికా వైమానిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై కూడా క్షిపణి దాడులకు దిగింది. యూఏఈ, కువైట్, బహ్రెయిన్, ఖతార్ తదితర దేశాల్లోని అమెరికా బేస్లపై దాడులు చేసింది. కాగా, సోమవారం శత్రు దేశానికి చెందిన ఓ ఫైటర్ జెట్ను కూల్చివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. కువైట్ గగనతలంలో ఎగురుతున్న ఒక ఎఫ్-15 ÷టైర్ జెట్ను తమ క్షిపణి వ్యవస్థతో కూల్చివేసినట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఇరాన్ విడుదల చేసింది. వైరల్ అవుతున్న ఆ వీడియో ప్రకారం.. ఓ యుద్ధ విమానం మంటల్లో చిక్కుకుని నెమ్మదిగా కిందకు పడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ విమానం అమెరికాదా లేక ఇజ్రాయెల్దా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పైలట్లు ఇద్దరు పారాచూట్ల సాయంతో క్షేమంగా బయటపడినట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే, ఈ యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తున్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు.

## ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

:ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో ’పబ్లిక్ పర్సెప్షన్’ కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..’పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.

## దుబాయ్లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరాన్పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్థరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ - 3 సమీపంలో క్షిపణి దాడులు జరిగనట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు. దుబాయ్ ఎయిర్పోర్ట్పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్లోనే చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.

## ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు సిద్ధం

ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ విధానం అహింసా పద్ధతి, కానీ బీజేపీది మాత్రం హింసా విధానమని అన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనేది బీజేపీ ఆలోచన అని విమర్శించారు. కానీ కాంగ్రెస్కు అధికారం ముఖ్యం కాదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్కు భయపడుతున్నారని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఓ కాంగ్రెస్ కార్యకర్తగా నేను కోరుకునేది ఒకటేనని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేద్దామని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన రాహుల్ గాంధీ మోదీపై యుద్ధానికి సిద్ధమని అన్నారు. డీసీసీ శిక్షణా తరగతుల ఈ ముగింపు కార్యక్రమంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డితో పాటు ఏపీసీసీ చీఫ్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.

## రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

వైసిపి ప్రభుత్వం అవలంబించిన మూడు ముక్కలాట ధోరణితో అనేక ఇబ్బందులు వచ్చినప్పటికీ లక్ష్యానికి అనుగుణంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ అన్నారు. సోమవారం మంత్రి రాజధాని అమరావతిలో పర్యటించారు. నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారులు టైప్ -1, టైప్ -2, గ్రూప్ డి ఉద్యోగుల క్వార్టర్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, మొత్తం 4,026 ఇళ్లకు అంతర్గత పనులు జరుగుతున్నాయని చెప్పారు. అమరావతిలో ప్రైవేట్ సంస్థలు కూడా నిర్మాణ పనులు ప్రారంభించాయన్నారు. నిర్మాణ సంస్థలు తమకు నిర్దేశిరచిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేశాయని, టార్గెట్ ప్రకారం పనులు చేయని షాపూర్జీ పల్లోంజి నిర్మాణ సంస్థ మేనేజ్ మెంట్ తో మాట్లాడుతున్నామని మంత్రి చెప్పారు. షాపూర్జీ పల్లోంజి యాజమాన్యం 5 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆందోళన చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా ’వేతనాల చెల్లింపు పై ఎలాంటి సమస్యా లేదని, కార్మికులు మంచినీరు కోసం ఆందోళన చేయగా సమస్యను పరిష్కరించడం..‘ జరిగిందని అన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో వైసిపి ప్రభుత్వం తనపై కూడా కేసులు పెట్టిందని మంత్రి చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్ లో 2001 లో తనకు చెందిన 60 సెంట్ల స్థలం కూడా పోయిందని, విజయవాడ సమీపంలో ఈడుపుగల్లులో ఉన్న తన స్థలం గుండా ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తుందని చెప్పారు. మా వాళ్ళు బిల్డింగ్ నిర్మాణం కోసం వెళ్తే సి ఆర్ డి ఎ అధికారులు మీ స్థలం లేదని చెప్పారన్నారు. కేసు కోర్టులో ఉన్నందున తాను ఎలాంటి వ్యాఖ్యానాలు చేయనున్నారు.

# ఇరాన్పై యుద్ధం...

ఇరాన్ రాజధాని టెహ్రాన్ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. అయితే, ఈ దాడుల కోసం అధ్యక్షుడు ట్రంప్ కాంగ్రెస్ అనుమతి తీసుకోకపోవడం అమెరికాలో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. డెమోక్రాట్లతో పాటు సొంత రిపబ్లికన్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు కూడా ట్రంప్ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, చట్టవిరుద్ధ యుద్ధమని వారు ఆరోపిస్తున్నారు. “ఇది అమెరికా కాంగ్రెస్పై జరిగిన దాడి. ఎలాంటి తక్షణ ముప్పు లేనప్పుడు అధ్యక్షుడు చట్టవిరుద్ధంగా యుద్ధం ప్రకటించారు. గతంలో జార్జ్ డబ్ల్యూ బుష్ కాంగ్రెస్తో సంప్రదించే నిర్ణయం తీసుకున్నారు“ అని కాలిఫోర్నియా డెమోక్రాట్ ప్రతినిధి రో ఖన్నా తీవ్రంగా విమర్శించారు. కెంటకీ రిపబ్లికన్ ప్రతినిధి థామస్ మాసీ, సెనేటర్ రాండ్ పాల్ వంటి వారు కూడా ఈ యుద్ధానికి వ్యతిరేకంగా గళం విప్పారు. యుద్ధం ప్రకటించే అధికారం కేవలం కాంగ్రెస్కు మాత్రమే ఉందని, ఇది ‘అమెరికా ఫస్ట్‘ విధానం కాదని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్ చర్యకు వ్యతిరేకంగా ఓటింగ్ జరపాలని, ఇందుకోసం కాంగ్రెస్ను తక్షణమే సమావేశపరచాలని పలువురు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వారం మధ్యలో దీనిపై ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. అయితే, స్పీకర్ మైక్ జాన్సన్, సెనేట్ మెజారిటీ లీడర్ జాన్ థూన్ వంటి రిపబ్లికన్ అగ్ర నాయకులు ట్రంప్ నిర్ణయాన్ని సమర్థించారు. అధ్యక్షుడికి రాజ్యాంగబద్ధంగా ఈ అధికారం ఉందని వారు వాదిస్తున్నారు. మరోవైపు, ఇరాన్ తన ప్రతీకార దాడులను ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై విస్తరిస్తుండటంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి.

## ఏఐ సృష్టించిన నకిలీ తీర్పులు...

నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థ విశ్వసనీయతకే భంగం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలోని ఓ ఆస్తి తగాదా కేసులో ఈ విషయం వెలుగుచూసింది. అడ్వకేట్ కమిషనర్ నివేదికపై ప్రతివాదుల అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ట్రయల్ కోర్టు కొన్ని సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించింది. అయితే, ఆ తీర్పులు అసలు లేనే లేవని, అవి ఏఐ సృష్టించిన నకిలీవని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఏపీ హైకోర్టు కూడా అవి నకిలీ తీర్పులేనని గుర్తించి హెచ్చరించినప్పటికీ, కేసు మెరిట్స్ ఆధారంగా పిటిషన్ను కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ను విచారించిన జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం.. ఏఐ సృష్టించిన నకిలీ తీర్పుల ఆధారంగా న్యాయస్థానాలు నడుచుకోవడం సంస్థాగతంగా ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. దీనికి చట్టపరమైన పర్యవసానాలు ఉంటాయని హెచ్చరించింది. ఈ వ్యవహారంపై అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు నోటీసులు జారీ చేసింది. కోర్టుకు సహాయం చేసేందుకు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ను అమికస్ క్యూరీగా నియమించింది. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేస్తూ, అప్పటివరకు అడ్వకేట్ కమిషనర్ నివేదిక ఆధారంగా ముందుకెళ్లవద్దని ట్రయల్ కోర్టును ఆదేశించింది.

# పందిపాడు 'ఇందిరమ్మ కాలనీ' నివాసుల కన్నీటి గాథ

# ప్రజా వేదికపై గళమెత్తిన నాగేంద్రుడు





**- సునయన ఆడిటోరియంలో అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం**

**- రోడ్డు లేక అంబులెన్స్ రాదు.. నీటి కోసం కిలోమీటర్ల నడక.. ఇదేనా పాలన?**

**- యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**కర్నూలు నంది పత్రిక......** నగర శివార్లలోని కల్లూరు గ్రామ పరిధిలో గల పందిపాడు 'ఇందిరమ్మ కాలనీ' నివాసుల దశాబ్దాల కష్టాలు సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రతిధ్వనించాయి. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' సందర్భంగా సామాజిక కార్యకర్త నాగేంద్రుడు, మరియు రాము,కాలనీ నివాసులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కాలనీలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు పడుతున్న నరకయాతనను నాగేంద్రుడు కలెక్టర్ కు కళ్ళకు కట్టినట్లు వివరించారు.

**రోడ్డు లేని కాలనీ.. అంబులెన్స్ రాని పరిస్థితి!**

కాలనీకి కనీసం నడవడానికి కూడా సరైన దారి లేకపోవడంతో విద్యార్థులు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాగేంద్రుడు ప్రస్తావించారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి ఉందని, దీనివల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను ఆసుపత్రికి తరలించేలోపే పరిస్థితి విషమిస్తోందని కలెక్టర్ మేడం దృష్టికి తీసుకెళ్లారు. మూడు నెలల క్రితమే రోడ్లకు నిధులు మంజూరైనప్పటికీ, అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన గట్టిగా ప్రశ్నించారు. చుక్క నీటి కోసం మూడు కిలోమీటర్ల పోరాటం..తాగునీటి సౌకర్యం లేక మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితి కాలనీలో ఉందని వాపోయారు. తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు వీధి దీపాలు లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు పెచ్చురిల్లుతున్నాయని, పొదల నుంచి పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తుండటంతో పిల్లలు భయం గుప్పిట్లో బతుకుతున్నారని వివరించారు. అధికారులపై కలెక్టర్ సీరియస్.. నాగేంద్రుడు వివరించిన కాలనీ పరిస్థితులపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూనే, అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిధులు మంజూరైన పనులు ఎందుకు ఆగిపోయాయని అధికారులను అక్కడికక్కడే నిలదీశారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, తక్షణమే కాలనీ పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

**కలెక్టర్ హామీ:** "పందిపాడు ఇందిరమ్మ కాలనీ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తాం. మంజూరైన రోడ్డు పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూస్తాం. త్వరలోనే ట్యాంకర్ల ద్వారా తాగునీరు, వీధి దీపాలు మరియు ఇతర మౌలిక వసతులు కల్పించి కాలనీ వాసుల ఇబ్బందులు తొలగిస్తాం."అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాము, పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రతినిధులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...





**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 103 ఫిర్యాదులు.**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ.**

**కర్నూలు నంది పత్రిక.....** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 103 ఫిర్యాదులు వచ్చాయి. **వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...** 1) కర్నూలు, బుధవార పేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నా కుమారునికి హైదరాబాదులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. 4 లక్షలు తీసుకొని మోసం చేసిందని నంద్యాల , పాములపాడు మండలం, జూటూరు గ్రామానికి చెందిన ఉమాదేవి ఫిర్యాదు చేశారు. 2) కుదువ పెట్టిన బంగారాన్ని డబ్బులు ఇచ్చి వెనక్కి తీసుకుంటానంటే ఆ వ్యక్తి ఇవ్వడం లేదని కర్నూలు, ఎన్ ఆర్ పేటకు చెందిన రామక్రిష్ణ ఫిర్యాదు చేశారు 3) భర్త చనిపోయాడు, కాని అత్త ఆస్తి ఇవ్వడం లేదని న్యాయం చేయాలని కర్నూలు , కప్పల్ నగర్ కు చెందిన శాంతకుమారి ఫిర్యాదు చేశారు. 4) ఎమ్ బి ఎ చదివిన నా కుమారుడు శశాంక్ కు నంద్యాలకు చెందిన చందన్ రూ. 1 లక్ష తీసుకొని బెంగుళూరు లేదా హైదరాబాద్ లలో మార్కెటింగ్ జాబ్ ఇప్పిస్తానని మోసం చేశాడని ఆదోని కి చెందిన జయంతి ఫిర్యాదు చేశారు. 5) కొందరు వ్యక్తులు కలిసి ఒక ఇంటి పై రూ. 40 లక్షల లోన్ తీసుకున్న తర్వాత ఒక కంతు మాత్రమే చెల్లించి , 8 నెలల నుండి కంతులు చెల్లించడం లేదని కర్నూలు, తాంద్రపాడు గ్రామానికి చెందిన ఎస్ ఆర్ జి హౌసింగ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ రామంజనేయులు ఫిర్యాదు చేశారు. 6) నా భార్య, 6 గురు కుమారులు కలిసి నాకు అన్నం పెట్టడం లేదు. ఇంట్లో నుండి బయటకు గెంటి వేశారని జీవనాధారం లేదని సి. బెళగల్ మండలం, కోండాపురం గ్రామానికి చెందిన తెలుగు చిన్న తిమ్మప్ప ఫిర్యాదు చేశారు. 7) నా కుమారుడు అభిలాష్ కి ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ లో ఉద్యోగం ఇప్పిస్తామని ఒక వ్యక్తి రూ. 1 లక్ష 30 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, గార్గేయపురం కు చెందిన జార్జ్ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్బంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్, సిఐలు రామక్రిష్ణ , శ్రీనివాస నాయక్, రమేష్ , మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

**బాల్య వివాహ విముక్త రథాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి**

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు, నంది పత్రిక.....**బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో బాల్య వివాహ ముక్త భారత్ - 100 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ విముక్త రథాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం "బాల్య వివాహ ముక్త భారత్" పేరుతో 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలన పై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు బాల్య వివాహ విముక్త రథంను ప్రారంభించడం జరిగిందన్నారు. 100 రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా, నేటి నుండి 8 వ తేది వరకు ఈ రథం జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల్లో తిరుగుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. ఆడపిల్లలకు చిన్న వయసులో పెళ్లిళ్లు చేసి వారి జీవితాలను చిన్నాభిన్నం చేయవద్దని, చదువు చెప్పించి వారిని ప్రయోజకులను చేయాలని కలెక్టర్ కోరారు.ఐసిడిఎస్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహ విముక్త రథం గ్రామాల్లో, మండలాల్లో తిరుగుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల పై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం నింపుతుందన్నారు. కేవలం మాటల ద్వారానే కాకుండా, ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా జానపద నృత్యాలు, డ్రామాలు, స్కిట్స్, కళాజాతా కార్యక్రమాల ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, సమాజంలో మార్పు తీసుకురావడమే ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, దీనికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని డైరెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి విజయ, సిడిపివో లు తదితరులు పాల్గొన్నారు.



# మోడల్ స్కూల్ నందు 6వ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుల ఆహ్వానం



**మద్రిపాడు మార్చి 02నంది పత్రిక :** నందవరం ఆదర్శ పాఠశాల నందు 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి చేరబోవు విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.లక్ష్మీ నారాయణ తెలియజేశారు.ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో చదివి వున్న విద్యార్థులు మార్చి 31 లోపల వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలనీ,ఓసీ,బీసీ విద్యార్థులు 1.9.2014 నుండి 31.8.2016 మధ్య,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 1.9.2012 నుండి 31.8..2016 మధ్య జన్మించి ఉండాలనీ,ఓసీ,బీసీ విద్యార్థులు 200 రూపాయలు,ఎస్.సి,ఎస్టీ విద్యార్థులు125 రూపాయలు దరఖాస్తు ఫీజు చెల్లించాలని,ప్రవేశ పరీక్ష 12.4.26 న ఉదయం 10.00 నుండి 12.00 వరకు నందవరం ఆదర్శ పాఠశాల లో నిర్వహించ బడుతుందని తెలియజేశారు.

# డోన్ చరిత్రలో సరికొత్త మైలురాయి: రూ. 5.11 కోట్ల సి.ఎమ్.ఆర్.ఎఫ్ సాయం

**ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా రూ. 35.97 లక్షల చెక్కుల పంపిణీ**



**నందిపత్రిక -ప్యాపిలి** పేద ప్రజల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఒక వరమని డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, సి.ఎమ్.ఆర్.ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 35,97,311 విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ, డోన్ నియోజకవర్గ చరిత్రలో గత 16 నెలల కాలం ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూనే, అనారోగ్యం మరియు అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఉన్న బాధితులను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం ముందుందని పేర్కొన్నారు. 543 మంది మంజూరైన మొత్తం: రూ. 5,11,99,337/- (ఐదు కోట్ల పదకొండు లక్షల తొమ్మిది వందల ముప్పై ఏడు రూపాయలు)



**పేదల పెన్నిధి సి.ఎమ్.ఆర్.ఎఫ్** "వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిధి కొండంత అండగా నిలుస్తోంది. ప్రమాదాలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వందలాది కుటుంబాలకు ఊరట కలిగించడం సంతృప్తిని ఇస్తోంది" అని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని, ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎద్దుల దొడ్డి ప్రభాకర్ రెడ్డి,వలసల రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఫణి రాజ్, రాఘవేంద్ర గౌడ్, శేషఫణిగౌడ్,శ్రీనివాసులు,సీమ సుధాకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

# సంతజూటూరు లో పట్టా దారు పాసు పుస్తకాల పంపిణీ



**బండిఆత్మకూరు నందిపత్రిక మార్చి 2:** బండిఆత్మకూరు మండల పరిధి లో ఉన్న సంతజూటూరు గ్రామంలో సోమవారం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది.గత ప్రభుత్వం లో ఇచ్చిన పాసు పుస్తకాలను ప్రభుత్వం రద్దు చేసింది.ప్రస్తుతం రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మీ భూమి -మీ హక్కు కార్యక్రమంలో భాగంగా సంతజూటూరు గ్రామంలోతహసీల్దారు పద్మావతమ్మ రైతులతో కూడిన ఒక సమావేశన్ని నిర్వహించారు.గ్రామంలో మొత్తం 865 పాసుపుస్తకాలు ఉండగా ఇందుకు అర్హులైన 648 మంది రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎలగాల రామచంద్రుడు,తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు పలుచాని మహేశ్వరరెడ్డి,గ్రామ రెవిన్యూ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాసు పుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమం లో పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు, నంది పత్రిక.....**అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదన్నారు. వచ్చిన ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వేగవంతంగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అధికారుల లాగిన్ లలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని పెండింగ్ లో ఉంచకూడదన్నారు. ఏ ఒక్క అర్జీ కూడా బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకూడదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు రీ ఓపెన్ కాకూడదన్నారు.. అదే విధంగా ఎట్ టు వ్యూ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను చూడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# అంగన్వాడీల ద్వారా గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు సంతృప్తికరమైన సేవలందించాలి

## మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి

## జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ ని అరకట్టాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, నంది పత్రిక....అంగన్వాడీల ద్వారా గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు సంతృప్తికరమైన సేవలందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సీడీపీఓలు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులతో శాఖ పనితీరుపై డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ...శాఖకు సంబంధించిన సూచికల్లో కర్నూలు జిల్లా చివరి స్థానాల్లో ఉండటం ఆందోళనకరమని పేర్కొంటూ, దీనిని సవాలుగా తీసుకుని పనితీరులో స్పష్టమైన మార్పులు తీసుకురావాలని, ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య పరీక్షలు, గర్భిణీలు, బాలింతలు, 06 ఏళ్ల పిల్లలకు సకాలంలో, నాణ్యతతో సేవలు అందించాలన్నారు. తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఇది శాఖపై ప్రజల విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్య, ఆట సామగ్రి వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రతి కేంద్రాన్ని ఆదర్శ అంగన్వాడీగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. పెద్ద కడబూరు, ఆస్పరి, మంత్రాలయం, కోసిగి, కౌతాళం, హోళగుంద మండలాల్లో సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల పోషణకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.2 వేల కోట్లు వెచ్చిస్తోందని, ప్రతి అర్హుడికి లబ్ధి చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టిన ఈ అంశంపై క్షేత్ర స్థాయిలో బాగా పనిచేసి సేవల నాణ్యతను పెంచాలని డైరెక్టర్ ఆదేశించారు.



**జిల్లాలో టీనేజ్ గర్భధారణలు అరికట్టాలి** జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ...జిల్లాలో టీనేజ్ గర్భధారణలను పూర్తిగా అరికట్టేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరును గణనీయంగా మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని, తక్షణ చర్యల ద్వారా ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించాలని స్పష్టం చేశారు జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల మరమ్మత్తులు మొదటి వారంలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ అంశాలపై ఒక్క ఫిర్యాదు కూడా రాకుండా అధికారులు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండవ వారంలో గర్భిణీలు మరియు బాలింతలలో ప్రభుత్వ పథకాలపై, పోషకాహార ప్రాముఖ్యతపై, ప్రజా సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. లబ్ధిదారుల సంతృప్తి స్థాయి పెరగాలని, వారిలో విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని చెప్పారు. పోషకాహార నాణ్యతపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ గర్భిణీలు, బాలింతలకు అందించే టేక్ హోమ్ రేషన్ (౬౩=) సమయానికి అందజేయాలని ఆదేశించారు. పాలు, గుడ్లు, ఇతర పోషకాహార పదార్థాల నాణ్యతను ముందుగా పరీక్షించి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడరాదని హెచ్చరించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం ఉదయం 9 గంటలలోపు తప్పనిసరిగా ప్రారంభమవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సూపర్వైజర్లు, సీడీపీఓలు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అంగన్వాడీ వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. టీనేజ్ గర్భధారణలు తగ్గించడమే కాకుండా, తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణలో జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో మహిళా మరియు శిశు సంక్షేమ సేవలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్జెడి రోహిణి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ, సీడీపీఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ స్థాయి "టెక్ ఫెస్ట్"





నంద్యాల సిటీ బ్యూరో మార్చి 2 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల వేదికగా సోమవారం నాడు జాతీయ స్థాయి "టెక్ ఫెస్ట్" కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు. కార్యక్రమ ప్రారంభం సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ వి. వెంకట బసవరావు గారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన స్వాగత నృత్యం ఆహూతులను అలరించింది. ఈ వేదికపై కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ కే.బీ.వీ. సుబ్బయ్య, డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి, మరియు అధ్యాపకులు ఎం. విజయ్ కాంత్, జి. మోహన్ మురళీధర్ గార్లు ఆశీనులయ్యారు. ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి (చైర్మన్) మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త నైపుణ్యాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇలాంటి టెక్ ఫెస్ట్‌లు విద్యార్థుల వినూత్న ఆలోచనలకు ప్రాణం పోస్తాయని ఆయన ఆకాంక్షించారు. కే.బీ.వీ. సుబ్బయ్య (ప్రిన్సిపల్) మాట్లాడుతూ ప్రతి ఏటా కళాశాలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను, సరికొత్త ఆవిష్కరణలను ( ప్రోత్సహించడానికి ఒక చక్కని వేదికని పేర్కొన్నారు. జి. హేమంత్ రెడ్డి (డైరెక్టర్) మాట్లాడుతూ ఫిబ్రవరి 28న సి.వి. రామన్ గారు 'రామన్ ఎఫెక్ట్' కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సైన్స్ ఫెస్ట్ ప్రాముఖ్యతను వివరించారు. నోబెల్ బహుమతి సాధించిన ఆ గొప్ప ఆవిష్కరణ స్ఫూర్తితో విద్యార్థులు తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ వి. వెంకట బసవరావు గారు మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలోనే అత్యుత్తమ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు అదృష్టవంతులని కొనియాడారు. ముఖ్యంగా:సాంకేతికత - ఉపాధి: ప్రస్తుతం ఉన్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సిద్ధం కావాలని, ముఖ్యంగా క్వాంటమ్ బేసిక్స్ పై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సూచించారు. మహిళా సాధికారత: ఆవిష్కరణల రంగంలో మహిళల పాత్ర పెరుగుతోందని, వారిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జీవన సూత్రాలు: ఓటమిని గెలుపుకు తొలిమెట్టుగా భావించాలని, గురువులను, పెద్దలను గౌరవిస్తూ క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇదే కళాశాలకు మీరు ముఖ్య అతిథులుగా తిరిగి రావాలని విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమం అనంతరం, ముఖ్య అతిథి ప్రొఫెసర్ వి. వెంకట బసవరావు గారిని కళాశాల యాజమాన్యం శాలువా మరియు జ్ఞాపికతో ఘనంగా సన్మానించింది. ఈ టెక్ ఫెస్ట్‌లో వివిధ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు.



# నంద్యాల జనసేన నాయకులు రాచమడుగు చందు,సుందర్ ల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.



నంద్యాల సిటీ బ్యూరో మార్చి 2 ( నంది పత్రిక ) పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ నాయకులు రాచమడుగు చందు,సుందర్ల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు,జన సైనికులు,వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కేకులను కట్ చేసి జనసేన పార్టీ నాయకులు రాచమడుగు చందు, సుందర్ లను శాలువాలను కప్పి,పూల హారాలు వేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సోషల్ మీడియా కో.ఆర్డినేటర్ ,సిరివెల్ల జనసేన నాయకులు జమాల్ బాషా మాట్లాడుతూ ఈరోజు జనసేన పార్టీ నాయకులు రాచమడుగు చందు, సుందర్ లు నంద్యాలలో జనసేన పార్టీకి ఎనలేని కృషి చేస్తున్నారని భగవంతుడు జనసేన పార్టీ నాయకులు రాచమడుగు చందు, సుందర్ లను ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని రాబోవుకాలంలో జనసేన పార్టీ లో ఎన్నో ఉన్నత పదవులను అలంకరించాలని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు రాచమడుగు చందు, సుందర్ లు మాట్లాడుతూ తమపై జనసేన పార్టీ నాయకులు,జన సైనికులు,వీర మహిళలు చూపిస్తున్న అభిమానాన్ని అభినందనలు తెలిపారు. తమపై జనసైనికులు వీర మహిళలు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొనిదెల పవన్ కళ్యాణ్ అడుగుజాడలలో తాము గతంలో నుంచి కూడా నేటి వరకు ఎల్లప్పుడూ కూడా నడుస్తామని పవన్ కళ్యాణ్ ఆశయా సిద్ధాంతాలను తీసుకొని ముందు వెళతామని భవిష్యత్తులో ఎప్పుడూ కూడా జనసేన పార్టీ కార్యకర్తలకు,జనసైనికులకు,వీర మహిళలకు ఎల్లప్పుడూ తమ వంతు సహాయ,సహకారాలు రాచమడుగు కుటుంబం ద్వారా జనసేన పార్టీ నాయకులుగా సేవలందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ జనసేన పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ జమాల్ బాష,సిరివెళ్ల జనసేన నాయకులు పసుపుల నరేంద్ర, నంద్యాల దేవనగర్ జనసేన నాయుకులు రాచమడుగు రాంబాబు, శివ శేఖర్, ఫరూక్, పిడిబాకుల చిన్న,సర్దార్ రవి ,ఫయాజ్, వెంకట రమణ, పృధ్వి తదితరులు పాల్గొన్నారు.



# గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ

## పేద విద్యార్థులకు ఫీజు రాయితీ తో శిక్షణ: నిర్వాహకుడు మజీద్.

## ఏ రంగాన్ని ఎంచుకున్నా, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి: డాక్టర్ రవికృష్ణ



నంద్యాల సిటీ బ్యూరో మార్చి 2 ( నంది పత్రిక ) స్థానిక బాలాజీ కాంప్లెక్స్ కళ్యాణమండపం రోడ్డులో కళారాధన సాంస్కృతిక సంస్థ సమాచార సాంకేతిక విభాగ కార్యదర్శి మజీద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగం ఎంచుకున్నప్పటికీ కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని అన్నారు. అనేక సంవత్సరాలుగా కంప్యూటర్ శిక్షకుడిగా పనిచేసిన అనుభవం కలిగి,కళారాధన సమాచార సాంకేతిక విభాగం కార్యదర్శిగా ఉన్న మజీద్ నూతన కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రం మజీద్ మాట్లాడుతూ తనతోపాటు సమద్ విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్, జావా, ఎం.ఎస్. ఆఫీస్, ఇంటర్నెట్ తదితర అంశాలలో కంప్యూటర్ శిక్షణ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. 16 కంప్యూటర్ సిస్టమ్స్ తో యువతీ యువకులకు వేరువేరుగా ఏర్పాటు చేశామని అన్నారు. కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రంగనాథ్ సెంటర్ పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తారని తెలిపారు. కళారాధన, లయన్స్ క్లబ్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున నేర్చుకోవడానికి వచ్చే విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ వి రమణయ్య, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఆర్.ఎస్ ప్రసాద్, మాతృభాష పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ పిజి కాలేజీ ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్,లయన్స్ క్లబ్ సభ్యులు వాసు, రామయ్య,కళారాధన సభ్యులు శివరామిరెడ్డి,వలి, మహబూబ్ బాషా,ఇమ్రాన్ పాల్గొన్నారు.

# బిందు సేద్యంలో 'ఆటోమేషన్' రైతులకు వరం

## మైక్రో ఇరిగేషన్ ఆటోమేషన్ పై సబ్సిడీ!

## జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



కర్నూలు, నంది పత్రిక.......బిందు సేద్యంలో ఆటోమేషన్ సాంకేతికత రైతులకు ఎంతో మేలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆధునిక సాగు ఆటోమేషన్ పథకం పోస్టర్ ను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద జిల్లాలోని రైతులకు సాగునీటి నిర్వహణను సులభతరం చేసేందుకు 'ఆధునిక సాగు - ఆటోమేషన్ పథకాన్ని' ప్రవేశపెట్టిందన్నారు. ఆటోమేషన్ వ్యవస్థ ద్వారా రైతులు ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకోవచ్చన్నారు. సరైన సమయంలో, సరైన మోతాదులో నీరు మరియు ఎరువులు అందించడం ద్వారా పంట ఉత్పాదకత పెరుగుతుందన్నారు. ఈ పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు 55% రాయితీ, ఇతర రైతులకు 45% రాయితీ వరిస్తుందన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులందరూ దీనికి అర్హులన్నారు. ఆసక్తి గల రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాలలో లేదా ఉద్యానవన శాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నమోదు చేసుకునే సమయంలో భూమి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలు తీసుకొని వెళ్లాలన్నారు.కార్యక్రమంలో డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, ఏపీఎమ్ఐపి పిడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నంద్యాల న్యాయవాదికి సన్మానం

## -మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి :

## న్యాయవాది షేక్ నౌమాన్ భాష :



నంద్యాల ప్రతినిధి. మార్చి 02 . (నంది పత్రిక ):మహిళా దినోత్సవం సందర్భంగా నంద్యాల ప్రముఖ న్యాయవాది షేక్ నౌమాన్ బాషాకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయ్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఉమెన్ వర్కింగ్ అధికారిని రష్మీ మణి ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తన సిబ్బందితో కలిసి ఆదివారం నంద్యాల ఎస్ ఆర్ బి సి కాలనీ నందు సమావేశం జరిగిందని అన్నారు. న్యాయవాది షేక్ నౌమాన్ బాషా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని తెలిపారు. అటవి శాఖలో మహిళా ఉద్యోగినుల సేవలు, ధైర్య సాహసాలు, క్రమశిక్షణలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, రతీ దేవి, ధనలక్ష్మి, అనురాధ, విజయలక్ష్మి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఘనత



నంద్యాల ప్రతినిధి. మార్చి 02 . (నంది పత్రిక ):పాణ్యం సమీపంలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ.సి.ఈ డిపార్ట్మెంట్ చదువుతున్న విద్యార్థులు ఎన్. ప్రమోద్మరియు బి. దినేష్ ఫిబ్రవరి 28న ఎమ్మిగనూరు లో నిర్వహించిన టెక్నోబ్రెన్-2 కే26 కార్యక్రమంలో పేపర్ ప్రెజెంటేషన్ విభాగంలో పాల్గొని ద్వితీయ బహుమతిని సాధించారు. వీరు సమర్పించిన డిజైన్ ఆఫ్ గ్నిఫెట్ బేస్డ్ హాఫ్ అడ్డేర్ అండ్ ఫుల్ అడ్డేర్ విత్ మల్టీప్లెక్స్ ఐన్ క్వేటర్నరీ లాజిక్" అనే పరిశోధనా పత్రం న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుంది. వారి వినూత్న ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానం మరియు సమర్థమైన ప్రదర్శనకు గాను ఈ అవార్డు లభించింది.ఈ సందర్భంగా కళాశాల ఎం. డీ శివరామ్ , ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సుబ్రహ్మణ్యం , ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున రావు , ప్రాజెక్ట్ పర్యవేక్షకులు డాక్టర్ జావిద్ భాష మరియు ప్రొఫెసర్ శ్రీనివాస రావు సమన్వయకర్తలు డాక్టర్ ప్రవీణ్ కుమార్ మరియు వి. శంకర్నాథ్ మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి కళాశాలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.



# పారిశుధ్యం పై అధికారుల చోద్యం




**బండిఆత్మకూరు నందిపత్రిక మార్చి 2:** గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమానికి గ్రహణం పట్టింది. పంచాయతీ కార్యదర్శుల అలసత్వం కారణంగా హరితరాయబారులు ఈ విషయంలో నిర్లక్ష్యముగా వ్యవహారిస్తున్నారు.బండిఆత్మకూరు మండలంలోని పలు గ్రామ పంచాయితీలలో ఎక్కడ చూసిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి.తడి చెత్త,పొడిచెత్త వేరు వేరు చేసి డంపింగ్ యార్డులకు తరలించాలన్న విషయాన్ని హరిత రాయబారులు పూర్తిగా విస్మరిస్తున్నారు. ఈ విషయాన్ని పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహా రిస్తున్నారు.బండిఆత్మకూరు మండలంలో,బి కోడూరు, పరమటూరు,సోమయాజులపల్లె, నారాయణాపురం గ్రామాలు మినహాయించి, బండిఆత్మకూరుపార్నపల్లె,ఈర్నపాడు, కడమలకాలువ, సింగవరం,సంతజూటూరు,పెద్దదేవలాపురం,భోజనము,కాకనూరు,ఎర్రగుంట్ల,లింగాపురం.,గాలిచేన్నయ్య పాలెం గ్రామాలలో లక్షలు ఖర్చు చేసి జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద డంపింగ్ యార్డ్ షెడ్లను నిర్మించారు ఈర్నపాడులో డంపింగ్ షెడ్డు గ్రామంలో దిష్టి బొమ్మాలా దర్శనమిస్తూ ఉంది.మరి కొన్ని గ్రామాలలో షెడ్లు నిరూపయోగంగా ఉన్నాయి.పొడిచెత్తను,తడి చెత్త ను వేరుచేసి డంపింగ్ యార్డులకు తరలించాల్సిన హరిత రాయబారులు ఎక్కడంటే అక్కడా ఉరిబయట పడవేస్తున్నారు. గ్రామాలలో చెత్త ను సేకరించిన పిదప సైకిళ్లను ఊరి బయట పడవేసి పోతున్నారు. లక్షలు ఖర్చు చేసి గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం సైకిళ్లను మంజూరు చేస్తే,అవి ఎక్కడంటే అక్కడ పడేస్తున్న కారణంగా సైకిళ్ళు ఎండకు ఎండిపోయి మూలన పడే అవకాశం ఉంది.ఎలాంటి భద్రత లేని కారణంగా సైకిళ్ళు చోరికి కూడా గురయ్యే అవకాశం కూడా ఉంది. ఇక డ్రైనేజి కాలువలలో పేరుకొని పోయిన పూడికను ఎత్తి వేసే విషయంలో నిర్లక్ష ధోరణిని ప్రదర్శిస్తున్నారు. పండుగలకు, పబ్బాలకు సైతం పూడికను తొలగించడంలేదు. పుష్కరానికోసారి అన్నట్లు గా కోళ్లు గెలికినట్లు కాలువలలో పూడికలెత్తుతూ ఉన్నారని మండల ప్రజలు ఘాటుగా నే విమర్శలు గుప్పిస్తున్నారు. స్వచ్ఛంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సంబంధించి మూడు రోజుల క్రితం మండలంలో అధికారులు పారిశుధ్యం పై చేపట్టిన పనులు ఆరంభంలో శూరత్వం అనే విధానాన్ని తలపించాయి.ఖర్మ కాలి ఎవరైనా పారిశుధ్యం పనులపై ఫిర్యాదు చేస్తే చర్యలు మాత్రం శూన్యం.బండిఆత్మకూరులో పుల్లమ్మ అనే మహిళ డ్రైనేజి పనుల విషయంలో ఒకటికి రెండు సార్లు ఫిర్యాదు చేసింది.కొందరు నాయకులు డ్రైనేజిని పూడ్చి వేయడం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని పంచాయతీ అధికారులకు చెప్పినప్పటికి ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు.ప్రజలకు జవాబుదారి తనంగా ఉండాల్సిన కొందరు పంచాయతీ కారుదర్శులు నాయకుల పంచన చేరి వారి భజన చేస్తూ,ప్రజల సమస్యలను గాలికొదిలేస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయం పై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పారిశుధ్యం పనులు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



## లిక్కర్ స్కాం ప్రధాన సూత్రధారిని అరెస్టు చేయాలి



**నంద్యాల ప్రతినిధి. మార్చి 02 . (నంది పత్రిక ):**ప్రజలకు ప్రభుత్వానికి వారధి బిజెపి జనతా వారధి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సూచన మేరకు నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో పీజీఅర్ఎస్ లో గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాం ఏదైతే ఉందో ప్రధాన సూత్రధారిని అరెస్టు చేయాలని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.అలాగే ప్రజల యొక్క సమస్యలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది.. జిల్లా కలెక్టర్ మాదకద్రవ్యాల నిర్మూలనకు ఎంతగానో కృషి చేసినందుకు బిజెపి జిల్లా పార్టీ తరఫున వారికి అభినందనలు తెలియజేయడమైనది. అవుకు మండలంలో కస్తూరిబా పాఠశాల మౌలిక వసతుల ఏర్పాటు చేయాలని చెప్పేసి సంబంధిత అధికారులు దృష్టికి కూడా తీసుకువెళ్లడం అయినది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కసెట్టి చంద్రశేఖర్ జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల రవీంద్ర కుమార్ జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి హరికృష్ణ నంద్యాల యు మోర్చా జిల్లా నాయకులు కళ్యాణ్ ఆచారి, శ్రీనివాసా గౌడ్,ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఉద్యమి సభ్యత్వం కార్యక్రమం ప్రారంభం.

### కార్యకర్తలకు భరోసా

### - తేజో నాథ్ (తేజ) - జనసేన ఉద్యమి సాధక్




**సిరివెళ్ల (నంది పత్రిక):** జనసేన పార్టీ ఆధ్వర్యంలో 2026వ సంవత్సరానికి గాను సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమి పేరుతో ప్రారంభించారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలకు అండగా నిలవాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఉద్యమి సభ్యత్వం తీసుకున్న వారికి భద్రత భరోసాగా ఆర్థిక సాయం అందించనున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సహజ మరణం సంభవిస్తే 1,00,000,. అనుకోని ప్రమాదంలో మరణిస్తే 5,00,000. ప్రమాదంలో గాయపడితే 50,000 పూర్తిగా వైకల్యం కలిగితే 2,00,000. పార్టీ సభ్యత్వం తీసుకోవాలనుకునేవారు ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, నామిని ఆధార్, సభ్యత రుసుము 400 రూపాయలు శాశ్వత ఫోన్ నెంబర్, ఇవన్నీ సమర్పించవలెను. ఈ సభ్యత్వ కార్యక్రమం పై ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత నాయకులను సంప్రదించాలని నిర్వాహకులు తేజ(తేజోనాద్) తెలిపారు. సంప్రదించండి సిరివెళ్ల మండల జనసేన పార్టీ ఉద్యమి సాధక్ సెల్ ఫోన్ నెంబర్ 7989919865.

# విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తాం

### జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్

### పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 72 ఫిర్యాదులు...

**నంద్యాల క్రైం, మార్చి02(నంది పత్రిక):-** ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే వచ్చిన పిర్యాదులపై దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 72 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు.

**ఫిర్యాదులలో కొన్ని....** 3.52 సెంట్ల వ్యవసాయ భూమిని నాకు అమ్ముతానని ఆవుల రమేష్ నాయుడు 15 లక్షలు మరియు హనుమంతు 26 లక్షలు అను వ్యక్తులు డబ్బులు తీసుకుని సదరు పొలాన్ని నాకు రిజిస్ట్రేషన్ చేయకుండా మరొక వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసి నాకు అన్యాయం చేశారు కావున వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండని పాణ్యం మండలానికి చెందిన వెంకటసుబ్బయ్య జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.




నా పిల్లలకు స్కూల్ లో యోగా టీచర్ గా ఉద్యోగం ఇప్పిస్తానని శివ శేఖర్ అనే వ్యక్తి నన్ను నమ్మించి నా వద్ద నుండి5,30,000 రూపాయలు డబ్బులు తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే నా పైనే దౌర్జన్యం చేసి బెదిరిస్తున్నాడు నాకు న్యాయం చేయండని ముష్టపల్లె గ్రామానికి చెందిన ఆదినారాయణ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నేను వెల్డింగ్ షాపు నడుపుకుంటూ జీవనం చేయుచున్నాము. నా షాపు ముందర షేక్ మొహమ్మద్ రఫీ మట్టి తోలి రాస్తా మూసివేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. కావున నాయందు దయవుంచి అతనిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండని సలీంనగర్ కు చెందిన షేక్ .షేర్ అలీ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

# యువకుడి శవం లభ్యం



**బండిఆత్మకూరు నందిపత్రిక మార్చి 2:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సింగవరం గ్రామ సమీపంలో కే సి కెనాలు వద్ద గల్లంతు అయిన యువకుడి శవం సోమవారం లభ్యమైనది. ప్రకాశం జిల్లా తాండూరు మండలం శివరామాపురం గ్రామానికి చెందిన నారి పెద్ది హేమంత్ అనే యువకుడు నిన్న కేసీ కాలువలో దూకి గల్లంతు అయ్యాడు. సోమవారం ఉదయం కాలువకు వందమీటర్ల దూరంలోనే యువకుడి శవం లభ్యమైంది.శవాన్ని బయటకు తీసేందుకు సింగవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు నబిరసూల్,మణికంఠనాయుడు, చిన్నమల్లిఖార్జున, కృష్ణమాచారి,రాజు,శ్రమించాల్సి వచ్చింది.ఈ విషయాన్ని పోలీసులకు వెంటనే సమాచారం అందివ్వటంతో పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొన్నారు.శవాన్ని పోస్టుమార్టం నిమిత్తము నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు.



### కమిషనర్ ఎన్. మౌర్య.

**తిరుపతి చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 23మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ కమిషనర్ ను కోరారు. మహతి ఆడిటోరియం సమీపంలో త్రాగునీటితో మురుగునీరు కలుస్తున్నాయి చర్యలు తీసుకోవాలని, ఐ ఎస్ మహల్ వెనుకభాగంలో చెత్తకుప్పలు తొలగించాలని, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని, జయశ్యామ్ థియేటర్ సమీపంలో బహిరంగ మూత్ర విసర్జన అరికట్టాలని, బైరాగి పట్టేడ లో కాలువలు శుభ్రం చేయాలని, ప్రశాంతి నగర్ లో యూడీస్ లీకేజీ అరికట్టాలని, ఫుట్ పాత్ ఆక్రమణలు అరికట్టాలని, రవీంద్ర నగర్ లో త్రాగునీటి సరఫరా చేయాలని, సి ఎస్ ఆర్ కాలనీ లో అనధికారిక నీటి కనెక్షన్ తొలగించాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## వందేళ్ళ చరిత్రకు భూమి పూజ చేసిన భూమా వర్గం.

### సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన లక్ష్మీరెడ్డి

### నాగిరెడ్డి పుల్లారెడ్డి ఎదుర్ల నాగ సురేష్

**శిరివెళ్ల (నంది పత్రిక) :-** సిరివెళ్ల మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో సుమారు 100 ఏళ్లకు పైబడి ఉన్న ఒక పురాతన మట్టి రహదారిని సీసీ రోడ్డుగా నిర్మాణం చేపట్టేందుకు ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ గారి వర్గం నేడు భూమి పూజ చేశారు. కేసీ కెనాల్ నీటి సంఘం అధ్యక్షులు కమతం లక్ష్మిరెడ్డి టిడిపి యువనేత సత్తారు నాగిరెడ్డి కాపు సామాజిక వర్గ టిడిపి యువ నేత ఎదుర్ల నాగ సురేష్



తదితర ప్రముఖులు మౌలిక వసతుల కల్పనకు ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కమతం లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు పలు వీధులను సిసి రోడ్లుగా మలుస్తున్నట్లు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో కులమతాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మౌలిక వసతుల కల్పనలో మరియు ప్రజల అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో రాజీ పడే ప్రసక్తే లేదని కమతం లక్ష్మిరెడ్డి తెలియజేశారు. యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల అమలుకు భూమా అఖిల ప్రియ గారు భార్గవ్ రామ్, జగత్ విఖ్యాత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఈ సందర్భంగా ఎదుర్ల నాగసురేష్ కుమార్ తెలియజేశారు.

## ఆరోగ్య బీమా రంగం... చైనా కంటే వెనుకబడి ఉన్న భారత్!

భారతదేశంలో హెల్త్ ఇన్సూరెన్స్ రంగం వేగంగా డిజిటలైజ్ అవుతున్నప్పటికీ, క్లయింట్లకు అవసరమైన విధంగా సేవలందిచడంలో (కస్టమైజేషన్) ఇంకా వెనుకబడే ఉందని ప్రముఖ సంస్థ 'ఏయాన్' తన తాజా నివేదికలో వెల్లడించింది. సోమవారం విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. 1,000 కంటే ఎక్కువ ఉద్యోగులున్న సంస్థలకు కస్టమైజేషన్ సపోర్ట్ అందించడంలో చైనాలోని 92 శాతం బీమా సంస్థలతో పోలిస్తే, భారత్‌లో కేవలం 50 శాతం సంస్థలు మాత్రమే ముందంజలో ఉన్నాయి. భారత హెల్త్ ఇన్సూరెన్స్ రంగం కవరేజీని విస్తరిస్తున్నప్పటికీ.. అవగాహన లేకపోవడం, సేవల ప్రమాణాలు, సామాన్యులకు అందుబాటు ధరలు వంటి విషయాల్లో ఇంకా సవాళ్లను ఎదుర్కొంటోందని నివేదిక పేర్కొంది. దీనిపై ఏయాన్ ఏపీఏసీ వెల్బీయింగ్ సొల్యూషన్స్ హెడ్ సూసన్ ఫ్యానింగ్ మాట్లాడుతూ, "భారత హెల్త్ ఇన్సూరెన్స్ మార్కెట్ ప్రస్తుతం అత్యంత కీలక దశలో ఉంది. యజమానులు, ఉద్యోగుల నుంచి అంచనాలు పెరుగుతున్నాయి. ఖర్చులను అదుపులో ఉంచుతూనే, మెరుగైన ఫలితాలను అందించేందుకు బీమా సంస్థలు వినూత్న మార్గాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. దేశంలో టెలీహెల్త్ సేవలు బాగా విస్తరించాయని, సర్వే చేసిన వాటిలో 83 శాతం బీమా సంస్థలు జనరల్ ఫిజీషియన్ కన్సల్టేషన్లు, దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణ, ఈ-ప్రిస్క్రిప్షన్ వంటి సేవలను అందిస్తున్నాయని రిపోర్ట్ తెలిపింది. అయితే, వీటి వల్ల అవుతున్న ఖర్చు ఆదా మాత్రం చాలా తక్కువగా (1.1 నుంచి 1.5 శాతం మాత్రమే) ఉందని పేర్కొంది.

# అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

### మార్చి 2వ నుంచి 20వ తేది వరకు జరిగే కార్యక్రమాల్లో అందరూ భాగస్వామ్యం కావాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, మార్చి02(నంది పత్రిక):-** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రామునాయక్, ఐసిడిఎస్ పిడి లీలావతి దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగా మార్చి 2వ తేదీ నుండి మార్చి 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలలో మహిళలు పాలుపంచుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. మార్చి 2వ ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు, ప్రణాళిక సమావేశం, మిషన్ శక్తి ఓరియంటేషన్, హబ్ ప్లాన్ ఫైనలైజేషన్, 3వ తేదిన సైబర్ భద్రత, డిజిటల్ భద్రత అవగాహన (మహిళలు/బాలికలు),4వ తేదీన రుణా మేళా, బ్యాంకర్స్ ఔట్రీచ్, ఆర్థిక అక్షరాస్యతలి5వ పీసీపీఎన్ డి టీ (గర్భధారణకు ముందు ప్రసవానికి ముందు రోగ నిర్ధారణ పద్ధతులు) కౌమార లైంగిక & పునరుత్పత్తి ఆరోగ్య అవగాహనలి6వ తేదిన సురక్షిత మాతృత్వం + పి ఎం ఎం వి వై (ప్రధాన్ మంత్రి మాతృ వందన యోజన) అవగాహన,



7వ తేదీన బి బి బి పి (బచావోబేటీ పఢావో)+ పీసీ పి ఎన్ డీటీ (గర్భధారణకు ముందు మరియు ప్రసవానికి ముందు రోగ నిర్ధారణ పద్ధతులు) + మహిళా భద్రతపై సైకిల్ ర్యాలీ, 8వ తేదీన మహిళా దినోత్సవ ప్రత్యేకం, సత్కారం, మహిళా నాయకుల సమావేశం కమ్యూనిటీ భాగస్వామ్యం, 9తేదీన మానవహారం చైల్డ్ హెల్ప్‌లైన్/కమ్యూనిటీ నాయకుల భాగస్వామ్యం, 10వ తేదిన తేదీ పురుషుల కోసం వంట పోటీ, లింగ సున్నితత్వంపై అవగాహన కార్యక్రమాలు, 11వ తేది కొత్త తల్లిదండ్రుల కోసం క్విజ్,ఎస్ ఆర్ హెచ్,కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, 12వ తేదీన డిగ్రీ పురుష విద్యార్థులకు సానుకూల పురుషత్వ అవగాహన కార్యక్రమాలు,13వ తేదీన మానసిక ఆరోగ్య అవగాహన, గృహ హింస మద్దతు సేవలు లీగల్ సహాయం కార్యక్రమాలు,16వ తేదీన మహిళా వ్యవస్థాపకత శిబిరం, నైపుణ్యాభివృద్ధి దిశానిర్దేశ కార్యక్రమాలు, 17వ తేదీన కెరీర్ సంప్రదింపులు, నైపుణ్యాభివృద్ధి డ్రైవ్ రునామేళా నిర్వహించడం, 18వ తేదీన ప్రయోజనాల కోసం యాసిడ్ దాడి నుండి బయటపడిన వారి మ్యాపింగ్, పోష్ యాక్ట్ పై అవగాహన, 20వ తేదీన విమోచన, ఏకీకృత నివేదిక (అన్ని థీమ్‌లు) ద్వారా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు.

# ప్రజలకు సేవలు సులభంగా అందాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

### ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 19 అర్జీలు





**కర్నూలు నంది పత్రిక......** నగరపాలక సేవలు ప్రజలకు సులభంగా అందేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు సంబంధించి 19 ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్, సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, కార్యదర్శి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, మెప్మా పిడి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

**వచ్చిన విన్నపాల్లో కొన్ని..** 1. సుంకేసుల రోడ్డులోని వసంత రెసిడెన్సీ వద్ద ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని, స్థానికులు ముంతాజ్ బేగం, మాధవిలత ఫిర్యాదు చేశారు. 2. శ్రీనగర్ నందు డ్రైనేజీ కాలువ నిర్మించాలని స్థానికులు రయోషా జబిన్, రాధికా, తదితరులు పాల్గొన్నారు. 3. మహావీర్ నగర్ డ్రైనేజీ కాలువ పొడిగించాలని స్థానికులు శేషిరెడ్డి, శంకరయ్య విన్నవించారు. 4. బృందావన్ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారించాలని స్థానికులు యు.వెంకటేశ్వర్లు కోరారు. 5. సుద్దవాగు నందు పూడిక వ్యర్థాలను తొలగించాలని స్థానికులు స్థానికులు శేఖర్, రేణుక, సోమయ్య, తదితరులు కోరారు.

# ప్రజా ఫిర్యాదులను మెరుగైన రీతిలో పరిష్కరించండి








### పిజిఆర్ఎస్ ద్వారా 262 దరఖాస్తుల స్వీకరణ

### రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 130 దరఖాస్తుల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, మార్చి 02(నంది పత్రిక):-** ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దరఖాస్తును సమయానుకూలంగా పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి పరిశీలించాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం 71 అర్జీలు ఇంకా ఓపెన్ చేయలేదని తెలిపారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారులకు అందజేసే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా, పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. రీ-ఓపెన్ అయిన అర్జీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, అవి మళ్లీ పెండింగ్‌లో పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆడిట్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చే వినతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వాటిని ప్రాధాన్యంతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 130 అర్జీల స్వీకరణ**

భూసంబంధిత సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 130 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 4, అడంగల్ సవరణలకు సంబంధించినవి 22, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 19, అసైన్డ్ భూములు, భూఆక్రమణలకు సంబంధించినవి 18, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 26, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 33, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 8 గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

**పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1)పాణ్యం మండలం నెరవాడ గ్రామానికి చెందిన ఎన్. లక్ష్మిరెడ్డి సర్వే నెం. 462/2లో తనకు కొంత భూమి ఉందని, అయితే ఆ భూమి ఆన్‌లైన్‌లో వక్ఫ్ బోర్డు భూమిగా నమోదైందని తెలిపారు. దానిని సవరించి తన భూమిని ఆన్‌లైన్ రికార్డుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. 2)బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన టి. లక్ష్మిదేవి తన భర్త మృతి చెందినందున, తనకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. 3)డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన ఎస్. మహబూబ్ బాషా సర్వే నెం. 473-బి1ఎ2, 473-సి3ఎ2లో 1 ఎకరా 57 సెంట్ల భూమి కలిగి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు రైతు భరోసా మరియు పంట నష్టపరిహారం అందలేదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

# వయోజన విద్యకు ఉల్లాస్‌తో ఊతం

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



**కర్నూలు నంది పత్రిక.....** వయోజన విద్యకు ఉల్లాస్‌తో ఊతం లభిస్తోందని, సమాజంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఉల్లాస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం2020లో భాగంగా 'ఉల్లాస్' (సమాజంలో ప్రతి ఒక్కరికీ జీవితాంత విద్యాభ్యాస అవగాహన) పేరుతో నవభారత సాక్షరత కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. గతంలో అమలులో ఉన్న సాక్షర భారత్ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఉల్లాస్ అక్షరఆంధ్ర పేరుతో రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. 15 ఏళ్లకు పైబడిన వయోజనుల్లో, ముఖ్యంగా మహిళల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరజ్ఞానం కల్పించడం, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను తిరిగి ఓపెన్ పది, ఇంటర్ తరగతుల్లో చేర్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం రూపొందించినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో మెప్మా పీడీ సుధాకర్, ఎస్ఈ రమణమూర్తి, ఎమ్ఈ మనోహర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# నాయకల్లు గ్రామంలో ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం

### కల్లూరు తాసిల్దార్ ఆంజనేయులు



**కల్లూరు నంది పత్రిక......** కల్లూరు మండలం నాయకల్లు గ్రామంలో ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు పాణ్యం నియోజకవర్గ శాసన సభ్యురాలు గౌరు చరితా రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యఅతిథిగా కల్లూరు మండలం తాసిల్దార్ కే ఆంజనేయులు మరియు డిప్యూటీ ఆర్ఎస్ తాసిల్దారు జయశ్రీ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వాకిటి మాదేష్, ఆధ్వర్యంలో నిర్వహించారు.కొంగనపాడు వినోద్, తలారి లక్ష్మన్న ,బోయ శ్రీనివాసులు ,తెలుగు పెద్ద మద్దయ్య ,తెలుగు అయ్యన్న ,మంగళి శ్రీరాములు ,మరియు గ్రామ ప్రజలు ఎ=వా లు విజయ మనోహర్ రాజు సురేష్, శ్రీనివాసులు గ్రామ సర్వే రాజు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో ప్రజల సానుకూలత పెంపొందించాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల బ్యూరో, మార్చి 02(నంది పత్రిక):-** ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్యత పథకాల అమలులో జిల్లాలో సానుకూలత శాతాన్ని పెంపొందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ఫిర్యాదు దారుల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రామునాయక్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలులో జిల్లాలో ప్రజల సానుకూలత శాతాన్ని పెంచే దిశలో చురుకుగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన తప్పులకు జిల్లా స్థాయి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. "కింది స్థాయి సిబ్బంది చూసుకోలేదు" అని చెప్పి బాధ్యత నుంచి తప్పించుకునే అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రతి జిల్లా అధికారి తన శాఖ పనితీరును సమగ్రంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగి వుండాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, కాలుష్య నియంత్రణ తదితర శాఖలకు కలిగిన రెగ్యులేటరీ అధికారాలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే సంస్థలకు కేవలం నోటీసులు ఇవ్వడం సరిపోదని, అవసరమైతే సీజ్ వంటి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆళ్లగడ్డలో నిబంధనలు పాటించని ఒక ఆర్ఓ ప్లాంట్‌ను సీజ్ చేయడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చినట్లు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రజారోగ్య సమస్యలు ఉద్భవించే పరిస్థితుల్లో అధికారుల చర్యలు మరింత దృఢంగా ఉండాలని స్పష్టం చేశారు. ఫైర్ ఎన్ఓసీ జారీ విషయంలో 100 శాతం పనితీరు ఉండాలని, ఎక్కడ పరిపాలనా లోపం ఉందో గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు. జిల్లాలోని శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, 20 శాతానికి పైగా నెగిటివిటీ ఉన్న శాఖల అధికారులు తక్షణమే కారణాలు వివరించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్ శాఖలో 41.7% నెగిటివిటీ నమోదైందని, వాహన్ సేవలపై సుమారు 40% ప్రతికూల అభిప్రాయం ఉందని తెలిపారు. యూరియా లభ్యతలో 38.4%, హౌసింగ్ విభాగంలో 33% నెగిటివిటీ ఉండడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మైనారిటీ వెల్ఫేర్ శాఖలో 33.2% నెగిటివిటీ ఉండగా, త్రాగునీరు, వీధి దీపాల వంటి మున్సిపల్ సేవల్లో 22% నెగిటివిటీ నమోదవడం గమనార్హమని, వేసవి కాలం దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో (జీజీహెచ్) 24 శాతం నెగిటివిటీ ఉండడంపై కూడా సమీక్షించాలని పేర్కొన్నారు. వెల్ఫేర్ హాస్టళ్లలో డేటాబేస్ ప్యూరిఫికేషన్ అత్యవసరమని, పాత డేటాను తొలగించి ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల వివరాలు, తల్లిదండ్రుల మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేయాలని సూచించారు. డేటా సరిచేసిన తర్వాతే పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు దిగువ స్థాయి నుంచి రెండో స్థానానికి రావడం ప్రశంసనీయం అని అభినందించారు. మైనారిటీ వెల్ఫేర్ శాఖ డేటా ప్యూరిఫికేషన్ తర్వాత మెరుగైన స్థానానికి చేరుకుందని పేర్కొన్నారు. సెర్ప్ జిల్లా స్థాయిలో టాప్ పర్ఫార్మింగ్ శాఖగా నిలవడం సంతోషకరమని తెలిపారు. 70 శాతం పైగా సానుకూలత సాధించిన శాఖలను ఆదర్శంగా తీసుకొని, 30% లోపు పనితీరు ఉన్న శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మొహమాటం వల్ల విధుల్లో వెనుకడుగు వేయరాదని, ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీ ఉండకూడదని అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడవద్దు" అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ల

# సంతజూటూరు లో పట్టా దారు పాసు పుస్తకాల పంపిణీ

**బండిఆత్మకూరు నందిపత్రిక మార్చి 2:** బండిఆత్మకూరు మండల పరిధి లో ఉన్న సంతజూటూరు గ్రామంలో సోమవారం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది.గత ప్రభుత్వం లో ఇచ్చిన పాసు పుస్తకాలను ప్రభుత్వం రద్దు చేసింది.ప్రస్తుతం రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మీ భూమి -మీ హక్కు కార్యక్రమంలో భాగంగా సంతజూటూరు గ్రామంలోతహసీల్దారు పద్మావతమ్మ రైతులతో కూడిన ఒక సమావేశన్ని నిర్వహించారు.గ్రామంలో మొత్తం 865 పాసుపుస్తకాలు ఉండగా ఇందుకు అర్హులైన 648 మంది రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎలగాల రామచంద్రుడు,తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు పలుచాని మహేశ్వరరెడ్డి,గ్రామ రెవిన్యూ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాసు పుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమం లో పాల్గొన్నారు.



# లక్ష్మాపురంలో 67 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు.

### ఎమ్మెల్యే గిత్త జయ సూర్య సహకారంతో గ్రామంలో సిసి రోడ్లు.

### భూమి పూజ చేసిన గ్రామ టిడిపి నాయకులు గోవిందు, మద్దిరెడ్డి గౌడ్, షమీమ్.

**నందికొట్కూరు మార్చి 2( నంది పత్రిక )** 67 లక్షలతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సహకారంతో మొదలుపెట్టడం జరిగిందనీ గ్రామ టిడిపి నాయకులు కుమ్మరి గోవిందు, మద్దిలేటి గౌడ్, షమిమ్ లు తెలియజేశారు. సోమవారం పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జి మండ్రా శివానందరెడ్డి ల ఆదేశాల మేరకు 67 లక్షలతో నిర్మిస్తున్న నూతన సిసి రోడ్ల కు గ్రామ టిడిపి నాయకులు గోవిందు, మద్దిలేటి గౌడ్, షమీం లు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎమ్మెల్యే గిత్త జయ సూర్య సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు జరగడం సంతోషకరమన్నారు. గ్రామ అభివృద్ధి కోసం 67లక్షల నిధులు కేటాయించి సిసి రోడ్ల నిర్మాణ పనులు చేయిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, టిడిపి నేత మండ్రా శివానందరెడ్డి లకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రీ-ఓపెన్ కు తావివ్వకండి







## అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపండి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

**వై ఎస్ ఆర్ కడప చీఫ్ బ్యూరో మార్చి 02, నంది పత్రిక** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీలకు అధికారులు వారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని రీ ఓపెన్ కు అవకాశం ఇవ్వరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.. సోమవారం కలెక్టరేట్ లోని సభాభవన్ సమావేశపు మందిరం నందు..ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా,డిఆర్వో విశ్వేశ్వర నాయుడు,వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...** అర్జీదారులు వారి సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో అర్జీలు సమర్పించడంజరుగుతుందని వారికి నాణ్యమైన,సంతృప్తి స్థాయి లో పరిష్కారం చూపే విషయంలో అధికారులు శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. ప్రభుత్వంప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ను ఇచ్చి నిర్వహిస్తోందని,ఇందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయి కి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకం గా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగాపరిష్కరించాలన్నారు.అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలనిఅర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ మెంట్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగాపరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు వారికి అందిన అర్జీల పరిష్కారానికి సమయం కేటాయించి సమీక్షా చేయాలన్నారు. అర్జీల పరిష్కారం లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..** 1) ఎర్రగుంట్ల మండలం హనుమాన్ గుత్తి గ్రామానికి చెందిన జి. గంగాధర్ తాను వికలాంగుడని,తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు. 2) తొండూరు మండలం బూచుపల్లి గ్రామానికి చెందిన పి. శ్రీనివాసులు తన కుమార్తె పి. రాఘవి చీజుజు పరీక్షకు ఈ నెల 7వ తేదీకి కుల ధృవీకరణ పత్రం అవసరం ఉందని, అందువల్ల కుల ధృవీకరణ పత్రం జారీ చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.

3) నందలూరు గ్రామానికి చెందిన కనకరాజు ఎదరపల్లి మండలంలోని సర్వే నంబర్లు 1151, 1152లో జూా-410 కింద సీట్లాట్ ఏర్పాటు చేసి చెట్లు నాటే పనులకు అనుమతి పొందారు. ఈ పనుల కొరకు ప్రభుత్వం సంబంధిత మెటీరియల్ మరియు నిర్వహణ ఖర్చుల బిల్లులు మంజూరు చేయవలసిందిగా కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో

డి.ఆర్.డి.ఏ.పి.డి. జి.రాజ్యలక్ష్మి,మెప్మా పిడి కిరణ్ కుమార్,పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, కో-ఆపరేటివ్ శాఖ అధికారి వెంకటసుబ్బయ్య,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లమల చెంచువాడ గిరిజనుల ఆర్తిని తీర్చేందుకు ముందడుగు

### - నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ హెచ్ ఆర్ సి



**కొత్తపల్లి - నంది పత్రిక :** నల్లమల అడవుల్లో నివసిస్తున్న చెంచు గిరిజనుల కష్టాలను తగ్గించేందుకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్ హెచ్ ఆర్ సి) కీలక నిర్ణయం తీసుకుంది సోమవారం మండలంలోని పాత మాడుగుల గిరిజన గూడెంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఈదురు. పద్మాకర్ ఆధ్వర్యంలో సహాయక కార్యక్రమన్ని చెప్పడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయి నుంచి ఆదేశాలు మేరకు కర్నూలు జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ హెచ్ ఆర్ సి ఆధ్వర్యంలో చెంచు గూడెం ప్రజల జీవనోపాధి మెరుగుపరచడం , మానవ హక్కుల పరిరక్షణలో భాగంగా నిత్యావసర సహాయంగా ఆహార పదార్థాలు, చీరలు, లుంగీలు టవలు , దుప్పట్లు చిన్నపిల్లకు బట్టలు తదితర అవసర వస్తువులను పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ, కర్నూలు జిల్లా కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సభ్యుడు నారాయణరెడ్డి, గ కర్నూలు జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ రోషన్న (రిటైడ్ డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ ), ఎన్ హెచ్ ఆర్ సి సంస్థ సభ్యులులేబర్ యూనియన్ లీడర్ అడివప్ప హర్ష గీత గంగాధర్ శెట్టి ,హెల్త్ వర్కర్ శాంతమ్మ మరియుస్థానిక ఆషా వర్కర్ పాల్గొన్నారు




# నంద్యాల మతసామరస్యానికి ప్రతీక: మంత్రి ఫరూక్



## నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందు సమావేశం.

### ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ఫరూక్

### అన్ని మతాల పర్వదినాలు నిర్వహించడం నంద్యాల ఐఎంఏ సాంప్రదాయం: డాక్టర్ రవి కృష్ణ

**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 2 ( నంది పత్రిక )** భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, నంద్యాల ఐఎంఏ ముస్లిం వైద్యుల నిర్వహణలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో ఉపవాస దీక్ష విరమణ, తదుపరి మౌలానా అబ్దుల్ హాది ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఉపవాసం పాటిస్తున్న వైద్యులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి ఇందులో పాల్గొన్నారు. తదుపరి ఇఫ్తార్ విందు సమావేశంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ముఖ్యఅతిథిగా, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం మతసామరస్యానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.తెలుగుదేశం పార్టీ లౌకిక తత్వానికి కట్టుబడి ఉందని అన్నారు.ఐఎంఏ వైద్యులు హిందూ పర్వదినాలు, క్రిస్మస్, రంజాన్ ఇఫ్తార్ సమావేశాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది ఐక్యతకు, సంఘీభావానికి దోహదం చేస్తుందన్నారు. నంద్యాల వైద్యులు సేవా దృక్పథం కలిగిన వారని అభినందించారు. వారి సమస్యల పరిష్కారానికి సహకారం అందజేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాలలో హిందూ ముస్లిం ఐక్యత కోసం తాము ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ ఆధ్వర్యంలో నంద్యాల వైద్యులు సంక్రాంతి, ప్రీ క్రిస్మస్, రంజాన్ ఇఫ్తార్ సమావేశాలు ఆనవాయితీగా చేస్తున్నామని, ఇది మతసామరస్యానికి, భిన్నత్వంలో ఏకత్వం కొనసాగించడానికి దోహదం చేస్తాయని అన్నారు. నంద్యాలలో మతసామరస్యం కొనసాగడానికి మంత్రి ఫరూక్ కృషి మరువలేమన్నారు. సీనియర్ వైద్యులు డాక్టర్ జఫరుల్లా, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ నంద్యాల వైద్యులు ఐకమత్యంతో ఉండి ప్రజలకు మంచి సేవలు అందించడంలో ముందున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖలీల్ మనీయార్, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రెడ్డి, రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ మధుసూదన రావు,సీనియర్ వైద్యులు డాక్టర్ బాబన్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ జహంగీర్,డాక్టర్ మహమూద్, డాక్టర్ హషమ్, డాక్టర్ మహ్మద్ రఫీ,డాక్టర్ ఆర్షద్, పెద్ద స్వామి, డాక్టర్ షబ్నం,డాక్టర్ అరిఫా భాను, డాక్టర్ జాస్మిన్ సుల్తానా, డాక్టర్ ఫాతిమా బి, డాక్టర్ చరిష్మా, ఫర్హీన్, నంద్యాల మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, అధిక సంఖ్యలో వైద్యులు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.



## బద్వేల్ పట్టణం లో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం



**బద్వేల్ మార్చి 2 (నంది పత్రిక ):** బద్వేల్ జనసేన నాయకులు తుడిమెళ్ళ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప పార్లమెంట్ జనసేన ఉద్యమి సభ్యత్వ సమన్వయకర్త టి సి వరుణ్ , రాష్ట్ర కార్యదర్శి తాతం శెట్టి నాగేంద్ర, మరియు స్టేట్ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఈశ్వర్ , కడప జిల్లా మాజీ సేవాదళ్ కోఆర్డినేటర్ పంద్రా రంజిత్ కుమార్ మరియు రైల్వే కోడూరు బీసీ నాయకులు గంగన్న , కడప పట్టణ నాయకులు జీవి రమణ పాల్గొన్నారు టి.సి వరుణ్ చేతుల మీదుగా బలిజ తెలగ కాపు బ్రహ్మంగారి మఠం సత్రం చైర్మన్ అశోక రాయల్ ని జనసేన కండువా వేసి జనసేన పార్టీలోకి సాధనంగా ఆహ్వానించారు.టిసి వరుణ్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్న జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు ప్రోగ్రాం ద్వారా పదివేల సభ్యత్వాలను చేసి జనసేన పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి. అదేవిధంగా ఈ సభ్యత్వ కార్యక్రమం ప్రతి ఒక్క కార్యకర్తకు పవన్ కళ్యాణ్ భరోసానివ్వడానికి కల్పించారు అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ సభ్యత్వ కార్యక్రమాన్ని ఒక మహా యజ్ఞంగా భావించి ముందుకు తీసుకెళ్లాలని అదేవిధంగా జనసేన పార్టీ మార్చి 14 ఆవిర్భావ దినోత్సవం అనంతరం బద్వేల్ నియోజకవర్గానికి కమిటీలు వేసే ఆలోచన కూడా అధిష్టానం ఉంది అని తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో బద్వేల్ నీటి సంఘం అధ్యక్షులు కొర్రపాటి సురేంద్ర, బద్వేల్ ఏఎంసీ డైరెక్టర్స్ చిన్ని సుబ్బారావు మరియు నౌషాద్ బేగం, ఏడు మండలాల జనసేన నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, నందకిషోర్, కె వెంకటేష్, గంగిరెడ్డి,మనోహర్,లక్ష్మీ నారాయణ, సిద్ధూ, ఇమ్రాన్, శీలం శెట్టి సుబ్బమ్మ, గంధం శెట్టి చంద్ర, నగిరి రమణయ్య,బద్వేల్ పట్టణ నాయకులు దద్దం నాగార్జున, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, శీలంశెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హోం గార్డ్సకు వెల్ఫేర్ ఫండ్ చెక్కులు అందజేసిన ... హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్

**కర్నూలు నంది పత్రిక......** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు హోం గార్డ్స్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుండి మంజూరైన చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలోనిహోంగార్డు కమాండెంట్ కార్యాలయంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్ హోంగార్డులకు సోమవారం అందజేశారు.హోం గార్డ్స్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుండి మంజూరైన మొత్తం రూ. 60 వేల విలువైన చెక్కులను ఏడు మంది హోం గార్డ్స్ లకు అందజేశారు.



**మొత్తం 7 మందిలో** ఇద్దరికి మ్యారెజ్ గ్రాంట్ క్రింద ఒక్కొక్కరికి రూ. 5 వేలు . 5 మందికి మెడికల్ గ్రాంట్ క్రింద ఒక్కొక్కరికి రూ. 10 వేలు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ కె. మాధవి రాణి, పోలీసు సిబ్బంది మరియు హోం గార్డ్స్ పాల్గొన్నారు.



## దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి.

**రుద్రవరం ప్రతినిధి మార్చి 2 (నంది పత్రిక):** నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన దుర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ పార్లమెంట్ రాజ్యసభ సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి తెలిపారు. సోమవారం అయిన రుద్రవరం సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి లక్ష్మీనరసింహస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్నప్పుడు దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయం మీదుగా గండ్ల ఏరు వాగు వరకు రోడ్డు నిర్మాణము చేపట్టడం జరిగిందన్నారు. దీంతో రవాణా సౌకర్యం మెరుగుపడి భక్తులు దేవస్థానాలను దర్శించుకోవడానికి వీలు ఏర్పడిందన్నారు. రోడ్డును మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. బీటీ రోడ్డు నిర్మాణాలు పూర్తయితే ఈ ప్రాంతము పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు గంధం రాఘవరెడ్డి, గంగుల భరత్ కుమార్ రెడ్డి, పుల్లారెడ్డి, సుదర్శన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.





## ఆహార నియమాలను పాటించండి - సంపూర్ణ ఆరోగ్యవంతులు కండి

**బద్వేల్, మార్చి 2 (నంది పత్రిక ):** ఆహార నియమాలను పాటించి, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని, సురేంద్రనగర్ వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. బద్వేల్ పట్టణంలో ఎన్జీవో హోం లో ఫిజియోథెరపీ ఏఎన్ఎం, ఆశాలకు సోమవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, దేవుడు ఇచ్చిన ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలన్నారు. వీలైనంతవరకు బయట ఆహార పదార్థాలను మాని, ఇంట్లో తినాలన్నారు. ఆకుకూరలు, కాయగూరలను సమృద్ధిగా తినాలన్నారు. నొప్పులకు తరచూ మందులను వాడకూడదన్నారు. ఫిజియోథెరపీ ద్వారా నడుము, మెడ నొప్పులు, కీళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చని, ఫిజియోథెరపిస్టులు సంతోష్ కుమార్ ,రమేష్ లు అన్నారు. ఏ నొప్పులు ఎలా ఉపశమనం పొందాలో, వారు చేసి చూపించారు. నీరు కాచి, చల్లార్చి త్రాగడం వలన మంచి ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు సౌమ్య, శరత్ చంద్ర ,మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నరసింహారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి వెంగయ్య, సూపర్వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్దన్ రావు, శ్రీరామయ్య, వెంకటసుబ్బయ్య, యూ పి హెచ్ సి ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



# సారా విక్రయదార కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపండి

### నాటు సారా వల్ల కలిగే అనర్థాలను తెలియజేయండి
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, మార్చి, 02(నంది పత్రిక):–** నాటు సార విక్రయదార కుటుంబాల జీవనోపాధికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా నాటుసార కుటుంబాల పునరావాస వ్యూహం మరియు కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో నంద్యాల డిఎస్పీ మంద జావలి అల్ఫోన్స్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, మెప్మా పిడి వెంకట దాసు, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారా విక్రయదార కుటుంబాలను పునరావాసం కల్పనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమం వారి జీవనోపాధి కోసం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఏ కేటగిరీలో 19 గ్రామాలు, బి కేటగిరీలో 19 గ్రామాలు, సి కేటగిరిలో 91 గ్రామాలను జిల్లాలో నాటు సారాను పూర్తి స్థాయిలో నివారించడానికి 19 ఫిబ్రవరి 2025 నుండి సెప్టెంబరు 12వ తేది వరకు పకడ్బందీ ప్రణాళిక వారీగా నాటు సారా తయారీని పూర్తి స్థాయిలో తొలగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. నాటు సార, కల్తీ నెయ్యి లాంటి ప్రాణాంతకమైన వాటిని చేయడం ద్వారా ప్రజా ఆరోగ్యం పట్ల చెలగాటం ఆడడం వల్లనే మీ మీద కేసులు నమోదవ్వడం జరుగుతోందన్నారు. అలాకాకుండా మీ అంతటా మీరు నాటు సార వదిలేసి ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మారడానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 222 కుటుంబాలు జీవనోపాధి కల్పించమని కోరడం జరిగిందని, అందులో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి అయిన విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉపాధి కల్పిస్తామని, మహిళలకు చేతివృత్తులు, కుట్టు అల్లికలు, పేపర్ కప్స్, జ్యూట్ బ్యాగ్స్ తయారీ, మహిళలకు పొదుపు గ్రూపులుగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఎ, మెప్మా పిడిలను కలెక్టర్ ఆదేశించారు. పురుషులకు పశుపెంపకం, తేనటీగ పెంపకం లాంటి జీవనోపాధి మార్గాల దృష్టి సారించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా సదురు కుటుంబాలకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలను అందజేయాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు నాటు సార విక్రయదార కుటుంబాల జీవనోపాధికి కల్పించాల్సిన సదుపాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం ... ఎమ్మెల్యే గిత్త జయ సూర్య



**జూపాడుబంగ్లా: మార్చి2:( నంది పత్రిక ):** మండల పరిధిలోని తాటిపాడు గ్రామంలో అనారోగ్య బారినపడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి స్థానిక ఎమ్మెల్యే సిఫారసుతో మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయ సూర్య బాధితులకు సోమవారం ఇంటింటికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు . తాటిపాడు గ్రామానికి చెందిన దీపికకు రూ 30028 చెక్కును మరియు షేక్ షాల్మియా కు రూ20350 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ వివిధ రోగాల బారిన పడి ఆర్థికంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం చేస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందజేసిన నిధులను తమ ఆరోగ్యలకే ఖర్చు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్ల యాదవ్,సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, తర్తూరు రమణారెడ్డి, భాస్కరరావు మాజీ సర్పంచ్ సోమన్న, లక్ష్మణ్ గౌడ్, కృష్ణారెడ్డి, ఎంపీడీవో గోపికృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ బషీర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్రబాబు, ఏపిఎం అంబమ్మ, ఏపీఓ రేష్మ, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతమ్మ, మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉగాది ఏర్పాట్లపై సమీక్ష



### ఉగాది ఉత్సవాల ప్రారంభం కంటే ముందునుంచే భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం
### భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లన్నీ ముందస్తుగానే పూర్తవ్వాలి
### అన్నివిభాగాలు సమన్వయంతో విధులు నిర్వర్తించాలి.
### భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా వుండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి.
### కార్యనిర్వహణాధికారి : శ్రీ యం. శ్రీనివాసరావు

**శ్రీశైలం మార్చి 02(నంది పత్రిక)** మార్చి 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఉగాదిమహోత్సవాలకు భక్తులు ముందస్తుగానే వచ్చే అవకాశం ఉందని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. భక్తులరద్దీకి తగినట్లుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని కార్యనిర్వహణాధికారివారు అన్ని విభాగాలను ఆదేశించారు. ఉగాది మహోత్సవాల ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారివారు సమీక్షించారు. దేవస్థానం కార్యాలయ భవనములోని సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ ఉగాది మహోత్సవాలలో భక్తులందరికీ గతంలో వలనే శ్రీస్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థమైన ఉత్సవాలలో 10 రోజులపాటు అనగా మార్చి 6 నుంచి 15వరకు రోజుకు నాలుగు విడతలుగా స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. ఈ విషయమై కర్ణాటక రాష్ట్రంలో ప్రసార మాధ్యమాల ద్వారా ఇప్పటికే విస్తృత ప్రచారం కల్పించడం కూడా జరిగిందన్నారు. గత నెలలో భాగల్కోట్ జిల్లా తేర్దాళ్ పట్టణంలో కన్నడ పాదయాత్ర భక్తబృందాలు, స్వచ్ఛంద సేవాసంస్థలతో జరిపిన సమన్వయ సమావేశంలో స్పర్శదర్శన, అలంకార దర్శన తేదీలను స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు. అదేవిధంగా నిన్న (01.03.2026) జరిగిన రెండవ విడత సమన్వయ సమావేశంలో కూడా స్పర్శ, అలంకార దర్శనం తేదీలను తెలియజేయడం జరిగిందన్నారు. భక్తులు స్పర్శదర్శనం కోసమై ఉత్సవాలకంటే ముందస్తుగానే క్షేత్రాన్ని చేరుకునే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా గత సంవత్సరం కంటే కూడా భక్తులసంఖ్య పెరిగే అవకాశం కూడా ఉందన్నారు. ఉగాది ఏర్పాట్లకు సంబంధించి ఇప్పటికే ఫిబ్రవరి 28వ తేదీన జిల్లా కలెక్టర్ వారు జిల్లాస్థాయిలో ఆయా శాఖలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ వారు ఆదేశించినట్లుగా అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ తదితర విభాగాలను కూడా ఆదేశించారు. అదేవిధంగా ఆయా పనులలో పూర్తి నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉత్సవాలకు కాలిబాట మార్గములో అనగా వెంకటాపురం, నాగలూటి, దామెర్లకుంట్ల, పెద్దచెరువు, మఠంబావి, భీమునికొలను, కైలాసద్వారం మీదుగా క్షేత్రానికి వస్తారని, కావున కాలిబాట మార్గములో తగిన సదుపాయాలను కల్పించాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. అటవీశాఖ అధికారుల సమన్వయంతో ఆయా ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా కాలిబాటలో భక్తులకు మంచినీటిని అందించడములో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఏర్పాటు చేసినట్లుగానే కైలాసద్వారం వద్ద కూడా అదనపు మంచినీటి ట్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కైలాసద్వారం, భీమునికొలను మార్గములో సింటెక్సు ట్యాంకులను నెలకొల్పి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా నీటిసరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని నీటిసరఫరా విభాగాన్ని ఆదేశించారు. మహాశివరాత్రిలో వేయబడ్డ మంచినీటి కుళాయిలన్నింటినీ కూడా ఉగాది ఉత్సవాలలో కూడా వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సాక్షిగణపతి, హఠకేశ్వరం, శిఖరేశ్వరం మరియు కైలాద్వారంతో పాటు క్షేత్రంలో భక్తులు బసచేసే పలు ప్రదేశాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా దర్శనం క్యూలైన్లలో కూడా నిరంతరం మంచినీటి సరఫరా చేయాలన్నారు. కాలిబాట మార్గంలోని నాగలూటి, పెచ్చెర్వు, కైలాసద్వారం మొదలైన చోట్ల మరియు శ్రీశైలక్షేత్ర పరిధిలో పలుచోట్ల భక్తులకు అన్నదానం చేసే దాతలకు దేవస్థానం నుండి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాలలో క్షేత్రపరిధిలో కూడా పలుచోట్ల భక్తులు అన్నదానం చేస్తుంటారని, అన్నదాన బృందాలన్నింటికి దేవస్థానం తరుపున ఆయా ఏర్పాట్లను చేయాలని ఇంజనీరింగ్ మరియు అన్నప్రసాద వితరణ విభాగాలను ఆదేశించారు. ముఖ్యంగా అన్నదాన ప్రాంతాలలో పైప్ పెండాల్స్, లైటింగు ఏర్పాటు, మంచినీటి సరఫరా ఏర్పాటు ఉండాలన్నారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు నిరంతర మంచినీరు, అల్పాహారాన్ని అందజేసే ఏర్పాట్లు చేయాలని అన్నదాన, ఆలయ మరియు క్యూలైన్ల నిర్వహణా విభాగాలను కార్యనిర్వహణాధికారి ఆదేశించారు. ఎండతాకిడి అధికంగా ఉన్నందున క్యూకాంప్లెక్సు మరియు క్యూలైన్లలో అవసరమైనచోట్ల కూలర్లను కూడా ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఏర్పాట్లు చేసినట్లుగానే భక్తులు సేద తీరేందుకు ఉగాది మహోత్సవాలలో కూడా పలు చోట్ల పైప్‌పెండాల్స్ ( చలువ పందిర్లు) మొదలైనవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీలైనన్ని ఎక్కువ ప్రదేశాలలో ఈ ఏర్పాట్లు ఉండాలన్నారు. చలువపందిర్లు వేయబడిన అన్ని ప్రదేశాలలో కూడా తగినంత విద్యుద్దీకరణ ఏర్పాట్లు ఉండాలన్నారు. అదేవిధంగా మంచినీరు కూడా అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని క్షేత్రపరిధిలోని పలు ఆరుబయలు ప్రదేశాలలో లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. దేవస్థానం అతిథిగృహాల ప్రాంగణం, ఉద్యానవనాలు, తాత్కాలిక వసతిప్రదేశాలు మొదలైన చోట్ల వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఈ తాత్కాలిక లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆలయంలో స్వచ్ఛంద సేవలను అందించే సేవకులకు నిర్ణీత వేళలలో షిఫ్టులను నిర్ణయించి వీరికి తదనుగుణంగా తాత్కాలిక గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు. క్షేత్రపరిధిలోనూ మరియు కైలాసద్వారం మొదలైనచోట్ల జిల్లా వైద్యశాఖ సహకారముతో తాత్కాలిక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యవిభాగాన్ని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణకుగాను మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో చేపట్టినట్లుగానే తగు కార్యాచరణ ప్రణాళికలతో చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేందుకుగాను అవసరమైన సంఖ్యలో ట్రాక్టర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్రపరిధిలో పలుచోట్ల గల శాశ్వతమరుగుదొడ్లను భక్తులు వినియోగించుకునేందుకు వీలుగా వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. వీటితో పాటు పలుచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు సమాచారాన్ని తెలియజేసేందుకు అవసరమైన అన్ని చోట్ల కూడా కన్నడభాషలో విస్తృతంగా సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ మరియు శ్రీశైలప్రభ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా క్షేత్రపరిధిలో బహిరంగ మలమూత్రవిసర్జనను నిషేధించిన విషయమై సూచికబోర్డుల ద్వారా భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఉత్సవాలలో భక్తులను అలరించేందుకు కన్నడ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కన్నడ భక్తి సంగీతవిభావరి కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో పాటు కన్నడ ప్రవచనాలు, కన్నడ భక్తినాటకాలను కూడా ఏర్పాటు చేయాలని ప్రజాసంబంధాల అధికారి వారిని ఆదేశించారు. మహాశివరాత్రికి ఏర్పాటు చేసినట్లుగానే భక్తుల సౌకర్యార్థం అవసరమైన మేరకు ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాలలో భక్తుల సౌకర్యార్థమై నందిసర్కిల్, కల్యాణకట్ట, పాతాళగంగమెట్లమార్గం, సాక్షిగణపతి, హేమారెడ్డి మల్లమ్మ మందిరం, సెంట్రల్ పార్కింగ్, దేవస్థానం వైద్యశాల మొదలైన చోట్ల తాత్కాలిక సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో సిబ్బందిని నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమాచార కేంద్రాలలో కన్నడ ప్రాంతాల స్వచ్ఛందసేవకులను ఏర్పాటు చేసుకుని వారి సహకారంతో భక్తులకు తగు సమాచారాన్ని అందజేయాలన్నారు.



# ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య.

### భారీ గజమాలతో స్వాగతం పలుకుతూ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన గ్రామ నాయకులు.



**నందికొట్కూరు మార్చి 2( నంది పత్రిక)**మండల పరిధిలో కొణిదెల గ్రామంలో శ్రీ మాత్కోణిదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి తిరుణాల మహోత్సవ సందర్భంగాసోమవారం అంతరాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలను గ్రామ నాయకులు సర్పంచ్ నవీన్, నాయకులు కిరణ్ కుమార్ మరియు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య కు భారీ గజమాలతో స్వాగతం పలికి టిడిపి మండల కన్వీనర్ మండ్రా సురేంద్ర నాథ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కొంకతి కిరణ్ కుమార్ లను గ్రామ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రైతు సంఘం నాయకులు బెస్తరాజు, రంగస్వామి, మాల మహానాడు నాయకులు డాక్టర్ వెంకటేష్, కార్యకర్తలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నందిపాడు లో రంగారెడ్డి గారి కుటుంబాన్ని పరామర్శించిన... చల్లా శ్రీలక్ష్మీ



**కొలిమిగుండ్ల మార్చి 2నందిపత్రిక** మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన రంగారెడ్డి గారి రాజేశ్వరమ్మ (70) జనవరి నెల 26వ తేదిన గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అవుకు మండల జడ్పీటిసి స్వర్గీయ ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి సతీమణి చల్లా శ్రీలక్ష్మి మృతురాలి స్వగృహం చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికీ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పేద ముస్లిం ప్రజలకు రంజాన్ తో పనిచేసిన కౌన్సిలర్ షేక్ నాయక్.



**నందికొట్కూరు మార్చి 2( నంది పత్రిక)** వైసిపి రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని రంగారెడ్డి పేద ముస్లిం ప్రజలకు రంజాన్ తోఫా కిట్ల రూపంలో అందజేసిన కిట్ల ను సోమవారం ఏడో వార్డులో కౌన్సిలర్ నాయక్ పేద ముస్లిం ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు దాత రంగారెడ్డి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ యూత్ నాయకులు లడ్డు, జావిద్, మునవర్, అదిల్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్ర గ్రహణం కారణంగా దేవస్థానం మూసివేత.



**బేతంచెర్ల మార్చి 2 ( నందిపత్రిక ).** మంగళవారం పాక్షిక చంద్ర గ్రహణంను పురస్కరించుకొని శ్రీ మద్దులేటీ లక్ష్మీ నారసింహ దేవాలయం ను మూసి వేయబడునని ఉపకమీషనర్ & దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు తెలిపారు.మరలా బుధవారం తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు ఆలయ సంప్రో క్షణము ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 8 గంటలకు, భక్తులకు శ్రీ స్వామి వారి దర్శనము అనుమతించబడునని తెలిపారు.

# ఇంటింటికి మంచినీటి సౌకర్యం

### - ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని కృష్ణా నది ప్రాంతంలో నివసిస్తున్న గ్రామాల్లోని ప్రజలకు ఇంటింటికి మంచినీటి సౌకర్యం అందిస్తామని ఆర్డబ్ల్యూఎస్ మహమ్మద్ జుబేర్ తెలిపారు. సోమవారం జానాల గూడెం, బలపాల తిప్ప, సిద్దేశ్వరం గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి మంచినీటి కుళాయి పనులు కాంట్రాక్టర్ మద్దిలేటి యాదవ్ తో కలసి పనులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు వేసవిలో వచ్చే త్రాగునీరు సమస్యలను తలెత్తకుండా గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఇంటింటి మంచినీటి కుళాయి కోసం జలజీవన్ మిషన్ కింద జనాల గూడెం, సిద్దేశ్వరం, బలపాల తిప్ప గ్రామాలకు సుమారు 15 లక్షల నిధులతో పనులు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కొంతమేరకు పనులు పూర్తయ్యాయని మరో వారం రోజులో గ్రామ ప్రజలకు మంచినీరు అందిస్తామన్నారు.



# బనగానపల్లె కేంద్రంగా భూగర్భ ఖనిజ దోపిడీ







**రోడ్డు గ్రావెల్ నుండి ఎర్రమట్టి వరకు అక్రమ మైనింగ్**

**నిరోధించలేని మైనింగ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ**

**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి**

**కాగితాలకే పరిమితమైన భూగర్భ గనుల శాఖ మంత్రి 2025 మైనింగ్ చట్టం**

**బనగానపల్లె పరిసరాల్లో కాలగర్భంలో కలిసిపోతున్న ఆధ్యాత్మిక కేంద్రాలు**

బనగానపల్లె మార్చి 2నంది పత్రిక

అనాదికాలం నుండి బనగానపల్లె ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా వెలసిల్లుతున్నది. బనగానపల్లెకు పడమర దిక్కున బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసిన రవ్వలకొండ క్షేత్రము మరియు ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి, ఉత్తరం దిక్కున నందవరం చౌడేశ్వరి దేవాలయం, దక్షిణం వైపు సహజ సిద్ధంగా ఏర్పడిన బెలుం గుహలు ఉండగా నవాబుల కాలం నాటి చారిత్రక కట్టడాలు ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో బనగానపల్లె కేంద్రంగా జరుగుతున్నటువంటి అక్రమ మైనింగ్ తాకిడికి, ఈ ఆధ్యాత్మిక కేంద్రాలు తమ ఉనికిని కోల్పోతున్నాయి ఇక్కడ భూగర్భంలో ఉన్న కంకర రాయిని వెలికి తీసేందుకు వీరు చేస్తున్న బ్లాస్టింగ్ వలన ఈ కేంద్రాలు ఉనికిని కోల్పోయి చరిత్ర కు ఆనవాళ్లుగా మిగిలిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ఆధ్యాత్మిక వాదులు పర్యాటకులు ఈ కేంద్రాలకు రావాలంటేనే భయపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆధ్యాత్మిక వాదులు అంటున్నారు.

**ధనార్జనే ధ్యేయంగా చట్టబద్ధతలేని మైనింగ్**

బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడినటువంటి ప్రకృతి సంపదను ధనార్జనే ధ్యేయంగా కొంతమంది దోపిడిదారులు తమ అక్రమ మైనింగ్ ద్వారా నాశనం చేస్తున్నారు. వీరు చేస్తున్నటువంటి మైనింగ్ కు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు గాని పర్యావరణ అనుమతులు గాని లేవు దీంతో ధనార్జన ధ్యేయంగా వీరు చేస్తున్నటువంటి మైనింగ్ వల్ల ఆధ్యాత్మిక కేంద్రాలు పాఠశాలలు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసిన రవ్వలకొండ ప్రాంతంలో చేస్తున్నటువంటి అక్రమ మైనింగ్ వల్ల కాలజ్ఞాన కేంద్రం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రాసిన కాలజ్ఞాన కేంద్రం ఉనికిని కోల్పోతున్నది అదేవిధంగా కొలిమిగుండ్ల బెలుం ప్రాంతంలో సహజ సిద్ధంగా ఏర్పడిన గుహలు చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధిగాంచినవి ఎంతోమంది పర్యాటకులు ఈ గుహలను చూడడానికి దూరప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి వాటిని చూసి ఆస్వాదిస్తూ ఉంటారు అయితే గుహల పరిసర ప్రాంతాల్లో చేస్తున్నటువంటి మైనింగ్ వల్ల గుహలను చూసేందుకు పర్యాటకులు రావాలంటేనే భయపడుతున్నారు. రవ్వలకొండ యాగంటి బెలూమ్ గుహల ప్రాంతాల్లో మైనింగ్ దారులు చేస్తున్న బీకర శబ్దాల వల్ల ఆధ్యాత్మిక కేంద్రాలు ఉనికిని కోల్పోతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**రాష్ట్ర మంత్రి ఆదేశాలు బే ఖాతారు**

అక్రమ మైనింగ్ ను అరికట్టేందుకు రాష్ట్ర భూగర్భ గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర 2025 అక్రమ మైనింగ్ నిరోధక చట్టాన్ని తీసుకువచ్చారు. ఎక్కడైనా ఇల్లీగల్ మైనింగ్ జరుగుతుంటే వాటి మీద కేసులు నమోదు చేయడం సంబంధిత బాధ్యులపై పెనాల్టీ విధించడం చేయాలని మైనింగ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖకు ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు సంబంధించి ఒక టోల్ ఫ్రీ నెంబర్ను కూడా ఇవ్వడం జరిగింది. అయితే బనగానపల్లెలో జరుగుతున్న ఇల్లీగల్ మైనింగ్ ను అరికట్టేందుకు ఏ అధికారి సాహసించడం లేదని పలువురు ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి**

బనగానపల్లె కేంద్రంగా యాగంటి పల్లె పరిసర ప్రాంతంలో అక్రమంగా తవ్వుతున్న ఎర్రమట్టి రోడ్ గ్రావెల్ వల్ల ప్రభుత్వ అదయానికి గండి పడుతున్నది. ఇక్కడ అక్రమ మైనింగ్ ను అరికట్టడానికి ఏ అధికారి సాహసించడం లేదు.గత ప్రభుత్వ హయాంలో తగ్గిపోయిన మైనింగ్ ఆదాయాన్ని పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయల్టీ మరియు లీజ్ దారులు చెల్లించాల్సిన డెడ్ రెంట్ లో నూతన విధానాన్ని తీసుకువచ్చారు. అయినప్పటికీ అక్రమ మైనింగ్ ఆగడం లేదని ప్రజా సంఘాలు సిపిఐ, సీఐటీయు నాయకులు అంటున్నారు.ప్రభుత్వ పెద్దలు ఈ అక్రమ ఖనిజ దోపిడీని అరికట్టి ఆధ్యాత్మిక కేంద్రాలను కాపాడాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.





## కూటమి ప్రభుత్వం తోనే ప్రతి గ్రామం అభివృద్ధి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

**రుద్రవరంలో పలు సిసి రోడ్ల ప్రారంభోత్సవం**





రుద్రవరం ప్రతినిధి మార్చి 2 (నంది పత్రిక): కూటమి ప్రభుత్వంతోనే ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం మండల కేంద్రం రుద్రవరంలో పర్యటించి నూతనంగా నిర్మించిన పలు సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో కార్యాలయం, ఎస్సీ కాలనీ, మరియు బెస్త కాలనీలలో నిర్మించిన సిసి రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామని, ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడా రాజీ పడబోమని ఆమె పేర్కొన్నారు. మొదటి విడతలో 49 లక్షల రూపాయలు, రెండో విడతలో 89 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మార్చి చివరి నాటికి నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆమె రైతులకు భరోసా ఇచ్చారు. కుందూ నది నుంచి కేసీ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ పనుల ప్రతిపాదనలను ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు, మార్చి 10న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే సమావేశంలో వీటిపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణకు 42 లక్షల రూపాయలు కేటాయించి పనులు పూర్తి చేసినట్లు వివరించారు.అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్వి రంగనాయకులు శెట్టి, పోలా గురుమూర్తి, కొమ్మలపాటి రాజారావు, అల్లడి శేఖర్, ఎర్రం ప్రతాపరెడ్డి, బివి కృష్ణారెడ్డి, పెద్ద పుల్లారెడ్డి, బాచిపల్లి వెంకటనారాయణ,బండారు బాలరాజు, మజ్జిగ చంద్ర, ముల్లా రజాక్, నాగేశ్వర రెడ్డి, లక్ష్మీనారాయణ, పలువురు అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ సీతా రామ,లక్ష్మణ విగ్రహాల ప్రతిష్టాపనలో చల్లా శ్రీలక్ష్మి





కొలిమిగుండ్ల మార్చి 2నందిపత్రిక కొలిమిగుండ్ల మండలం కోరుమనుపల్లె గ్రామంలో శ్రీ సీతారామ, లక్ష్మణ రామపరివార విగ్రహల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమము గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా జరిగింది. ప్రతిష్టాపన ప్రతిష్టపణ కార్యక్రమానికి స్వర్గీయ ఎమ్మెల్సీ శ్రీ చల్లా భగీరథ రెడ్డి సతీమణి అవుకు మండల జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి హాజరై గుండం ఆంజనేయస్వామి సమీపంలో నూతనంగా నిర్మించిన పట్టాభి రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, సీతారాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో, జూ"ని చల్లా రామకృష్ణారెడ్డి, నందిపాడు విష్ణువర్ధన్ రెడ్డి, చల్లా శ్రీలక్ష్మీ కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

## యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ



బనగానపల్లె మార్చి 2నందిపత్రిక సోమవారం సందర్భంగా యాగంటి ఉమామహేశ్వర స్వామి వారి దేవస్థానం నందు స్వామిఅమ్మవార్ల పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమము నందు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పాండురంగా రెడ్డి, ఆలయ చైర్మన్ మౌళీశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేష్ రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు..

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





జూపాడుబంగ్లా: మార్చి :2: (నంది పత్రిక) మండల పరిధిలోని మండ్లేము గ్రామంలో వైసిపి రాష్ట్ర యువజన విబాగా వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని డాక్టర్ బైరెడ్డి మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో అమీలియా హాస్పటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి పలు రకాల వైద్య నిపుణులు హాజరై ఇక్కడికి వచ్చిన ప్రజలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. గుండె, కంటి పరీక్షలు ఉచితముగా నిర్వహించారు. ప్రజలు మారుతున్న కాలానికి అనుకూలంగా ఆహారాలు వాటిలో జాగ్రత్తలు తీసుకోవాలని చిన్నపాటి నిర్లక్ష్యంతో జబ్బులు బారిన పడుతున్నారని వారు తెలిపారు. అనంతరం వైసీపీ నాయకుల సమక్షంలో డాక్టర్ బైరెడ్డి మల్లికార్జున రెడ్డి కేక్ కటింగ్ చేశారు. నాయకులు కార్యకర్తలకు ప్రజలకు కేకును పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి, వైసిపి ఎస్సి సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎర్రమల రమణ, పి. లింగాపురం గ్రామ సర్పంచ్ కేశవరెడ్డి నాగార్జున రెడ్డి, వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



## సంగమేశ్వర ఆలయ శిఖరానికి ప్రత్యేక పూజలు

**-క్రమేపీ బయటపడుతున్న సంగమేశ్వరాలయం**



కొత్తపల్లి – నంది పత్రిక: శ్రీశైలం వెనుక జలాల జలాధివాసం నుంచి సప్తనదీ సంగమ ప్రాంతంలో ప్రాచీన సంగమేశ్వరాలయం క్రమేపీ బయటపడుతుంది. దీంతో సోమవారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆలయ శిఖరానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిఖర భాగానికి అభిషేకాలు, అర్చనలు, మంగళ హారతీ వంటి విశేష పూజా క్రతువులు నిర్వహించారు. కృష్ణాజలాల నుంచి సంగమేశ్వరాలయం బయట పడుతుండడంతో సందర్శకుల, భక్తుల తాకిడి ఎక్కువ అవుతుంది.

## ఘనంగా బైరెడ్డి సిద్ధారెడ్డి జన్మదిన వేడుకలు





కొత్తపల్లి – నంది పత్రిక: మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్సీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర బూత్ కమిటీ విభాగం కార్యదర్శి ఏ.రవీంద్రారెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ పీ. నాగలక్ష్మీ రెడ్డి అభిమానులతో కలసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. వీరితో పాటు కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు మౌలాలి, స్వామిరెడ్డి, యువకులు పాల్గొన్నారు.

## మూసీపై బిఆర్ఎస్, బిజెపిల గోల

హైదరాబాద్ నగరంలో మూసీ ప్రక్షాళన చేసి గోదావరి నీటిని తెచ్చి కలపాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తుంటే భాజపా, భారాసలు అడ్డుపడుతున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. మూసీ ప్రక్షాళనతో నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సబర్మతి నది ప్రక్షాళనకు, మూసీ ప్రక్షాళనతో సంబంధం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అంటున్నారని, ఆయన మాటలన్నీ అవాస్తవాలని తమ పరిశీలనలో తేలిందన్నారు.గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి నదిని 22 కిలోమీటర్ల దూరం ప్రక్షాళన చేయడానికి గుజరాత్ ప్రభుత్వం పది వేలమందిని తరలించినట్లు అక్కడి అధికారులే స్వయంగా చెప్పారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలసి ఆయన సబర్మతి రివర్ ఫ్రంట్‌ను సందర్శించారు. అలగే విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డిలతో కలిసి ఆనంద్ అమూల్ పాల కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబర్మతి నీటిని ప్రక్షాళన చేసి పంటలకు అందిస్తున్నారని తెలిపారు. సబర్మతికి నీళ్లు నర్మదా నది నుంచి వస్తుంటే మూసీకి గోదావరి నుంచి తేవాలనేది రాష్ట్రప్రభుత్వ సంకల్పమని వివరించారు. సబర్మతి ప్రక్షాళనకు 2004 నుంచి 2014 వరకు 10 వేల మందిని తరలించినట్లు గుజరాత్ అధికారులు చెప్పారని, కానీ ఎవరినీ తరలించలేదని రామచందర్‌రావు అబద్దాలాడుతున్నారని శ్రీహరి మండిపడ్డారు.

## మహానంది క్షేత్రంలో వైభవంగా 16 రోజుల పండుగ..





మహానంది, మార్చి 02 (నంది పత్రిక):– మహానంది క్షేత్రంలో 16 రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు.మహాశివరాత్రి పర్వదినం పూర్తయిన తర్వాత క్షేత్రంలో 16 రోజుల పండుగ జరపడం ఆనవాయితీగా వస్తుంది.ఇందులో భాగంగా సోమవారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు,అర్చకులు ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహాశివరాత్రి కళ్యాణం నుంచి 16 రోజులపాటు దీక్షలో ఉన్న స్వామి అమ్మవార్లకు దీక్షా విసర్జన చేసి అంకురార్పణ చేసిన శుభాంకురములను (మొలకలు) ఉద్వాసన గావించి నంది తీర్థంలో (రుద్రగుండం కోనేరులో) కలిపారు. అనంతరం రథశాల వద్దకు మేళతాళాలతో చేరుకొని నైవేద్యాలను నివేదనగా సమర్పించారు.అనంతరం రథానికి కట్టిన కంకణాలను విసర్జించి,రథ దేవతలకు ఉద్వాసన పలికి రథాన్ని రథ మండపం లోకి లాగారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధు , పర్యవేక్షకులు అంబటి శశిధర్ రెడ్డి,దేవస్థానం అధికారులు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.





## ఫిర్యాదుదారుడి పట్ల కలెక్టర్ ఉదారత

## చేతికి గాయం చూసి వైద్య సాయానికి ఆదేశం

జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తొలి సారి నిర్వహించిన ప్రజావాణిలో ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన చెరుకు సోమనర్సయ్య తన భూ సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి రాగా అర్జీదారుడి చేతిపై దురదతో వాపు ఉండడాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ గమనించారు. చేతికి ఏమైందని బాధితుడిని కలెక్టర్ అడగ్గా మూడు రోజుల క్రితం చేతిపై జెర్రి పాకిందని సోమనర్సయ తెలుపడంతో అతడిని వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు పంపించాలని డీఎంహెచ్ వోను ఆదేశించారు. బాధితుడికి ఒక వ్యక్తిని సహాయంగా హాస్పిటల్‌కు పంపించి చికిత్సను అందించారు. డాక్టర్ల సూచన మేరకు అవసరమైన మందులు తీసుకున్న బాధితుడు ఆ తర్వాత మళ్లీ ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వైద్య సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత సదరు బాధితుడు వచ్చిన భూ సమస్య పై కలెక్టర్ కు అర్జీ సమర్పించి వెళ్లాడు. ఇంట్లోవారి ఆరోగ్య సమస్యల గురించి కుటుంబ సభ్యులే సరిగా పట్టించుకోని ఈ కాలంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించిన తీరును పలువురు ప్రశంసించారు.

# మీ భూమి.. మీ హక్కు





## రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

### ఎన్నికల హామీ మేరకు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు

### రైతుల భూములకు భరోసా ఇచ్చేందుకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు

**జూపాడుబంగ్లా :మార్చి 1: (నంది పత్రిక )** మండల పరిధిలోని పోతులపాడు గ్రామంలో "మీ భూమి – మీ హక్కు" ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయ సూర్య హాజరయ్యారు. రైతులకు ప్రభుత్వ రాజముద్ర కలిగిన 162 పట్టాదారు పాస్ పుస్తకాలను సోమవారం రైతులకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ రైతులకు క్యూఆర్ కోడ్, విశిష్ట సంఖ్య ఉన్న, మీ భూమి...మీ హక్కు పేరట రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. 2024 ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టాదారు పాస్ బుక్ లపై రాజముద్ర వేసి రైతుల హక్కులు పరిరక్షించాము అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు గ్రీవెన్స్ నిర్వహించిన ప్రతి చోట అనేక రెవెన్యూ సమస్యలు గురించి ప్రజలు అర్జీలు అందజేస్తున్నారు. రైతే రాజు, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే నమ్మకంతో కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవికాంత్, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, బన్నూరు సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, తర్తూర్ రమణారెడ్డి, తాటిపాడు కృష్ణారెడ్డి, బన్నూరు శేఖర్, పలుచాని మహేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, డిప్యూటీ తాసిల్దార్ ఎన్. నాగన్న, ఏపీవో రేష్మ, ఏపీఎం అంబమ్మ, పంచాయతీరాజ్ ఏఈ బషీర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్రబాబు, వీఆర్వో, వీఆర్ఏలు,సచివాలయ సిబ్బంది, టిడిపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కాలరాస్తే ఊరుకోం ప్రభుత్వానికి కే. ఓబులేసు హెచ్చరిక

## లేబర్ కార్డు పేరుతో వసూలు- హక్కులిచ్చే విషయంలో నిర్లక్ష్యం ఆందోళనకు కార్మిక సంఘాలు సిద్ధం



**మైదుకూరు, మార్చి 2 (నంది పత్రిక ):**అసంఘటిత రంగం మరియు భవన నిర్మాణ కార్మిక శక్తి పోరాట యూనియన్ అధ్యక్షుడు కే. ఓబులేసు ప్రభుత్వానికి కార్మికుల తరఫున విన్నవించారు. భవన నిర్మాణ కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నా, వారి భద్రతపై మరియు చట్టపరమైన హక్కులపై కడప జిల్లాలోని ప్రభుత్వ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్మికుల నుంచి లేబర్ కార్డులు, వాటి రెన్యువల్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ప్రభుత్వం, అదే స్థాయిలో వారికి రావాల్సిన చట్టబద్ధమైన హక్కులు అందించడంలో విఫలమవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కార్మికులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని తీవ్ర అన్యాయం చేసిందని, ఇప్పటి ప్రభుత్వం అయినా కార్మికుల పట్ల చిన్నచూపు చూడకుండా వారి హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాల్లో పనిచేసే అధికారులు ఇంకా కార్మికులను నిర్లక్ష్యం చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. అవసరమైతే వివిధ రంగాల కార్మిక సంఘాలు కలసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి, కార్మిక చట్టాల్లో ఉన్న హక్కులు సాధించుకుంటామని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, వారికి రావాల్సిన హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ప్రకటన చేసినట్లు కే. ఓబులేసు తెలిపారు.

# దేశ ఆర్థిక వ్యవస్థలో వస్త్ర రంగానిది ప్రముఖ పాత్ర.

## కమిషనర్ ఎన్. మౌర్య.



**తిరుపతి చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** దేశ ఆర్థిక వ్యవస్థలో వస్త్ర రంగం ప్రముఖమైన పాత్ర పోషిస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ అనుబంద టెక్స్‌టైల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక భీమాస్ హోటల్ నందు నిర్వహించిన "మార్కెట్ ఫర్ టెక్స్టైల్స్ అండ్ క్లాథింగ్ (ఎంసీటీ)" జాతీయ గృహ సర్వే శిక్షణా కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వస్త్ర రంగం వలన ఉద్యోగ, ఉపాధికి ఎక్కువ అవకాశం ఉండన్నారు. ఈ పరిశ్రమల ఉత్పత్తిలో సుమారు 13 శాతం, జీడీపీకి 4 శాతం వంతు ఇస్తోందన్నారు. దేశంలో సుమారు 4.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తూ, ఎగుమతుల్లో 12 శాతం వాటా కలిగి ఉందని చెప్పారు. టెక్స్టైల్స్ కమిటీ 1969 నుంచి నిర్వహిస్తున్న "మార్కెట్ ఫర్ టెక్స్టైల్స్ అండ్ క్లాథింగ్ (ఎంసీటీ)" జాతీయ గృహ సర్వే నివేదిక దేశంలో ప్రత్యేకమని తెలిపారు. దేశం వ్యాప్తంగా ఈ సర్వే ద్వారా గృహాల స్థాయిలో వస్త్ర వినియోగంపై వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఆదాయ వర్గాలు, పురుషులు, మహిళలు వంటి అంశాల వారీగా వినియోగ ధోరణులను ఈ నివేదిక ద్వారా తెలుస్తుందని తెలిపారు. ఈ సంస్థ 2024లో తొలిసారిగా రీయూజ్, రీసైకిల్ చేసిన వస్త్రాల మార్కెట్ పరిమాణాన్ని కూడా అంచనా వేసినట్లు తెలిపారు. పలు రకాల అంశాలను కూడా సర్వేలో చేర్చుతున్నారని చెప్పారు. దక్షిణ రాష్ట్రాల నుంచి 60 మంది లైజన్ అధికారులు 3,050 ప్యానెల్ గృహాల నుంచి 23 పట్టణాలు, 60 గ్రామీణ కేంద్రాల్లో డేటా సేకరిస్తున్నారని తెలిపారు. ఈ రెండురోజుల శిక్షణ కార్యక్రమం సర్వే చేసేవారికి ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాబార్డ్ సహకారంతో దేశవ్యాప్తంగా సుమారు 150 హ్యాండ్లూమ్, హ్యాండిక్రాఫ్ట్ ఉత్పత్తులకు ఈ శాఖ నమోదు చేసిందని తెలిపారు. వస్త్ర రీసైక్లింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి డేటా అందితే ఆంధ్రప్రదేశ్ టెక్స్టైల్ రంగ అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో టెక్స్‌టైల్ కమిటి సెక్రటరీ కార్తికేయ, డైరెక్టర్ తపన్ కుమార్ రౌత్, అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎగువ అహోబిలంలో రథోత్సవంపై ఊరేగుతున్న శ్రీ జ్వాలా నారసింహుడు





## శ్రీ జ్వాలా నారసింహుడు దేవ దేవుడి రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనులు.....

**ఆళ్లగడ్డ, ప్రతినిధి మార్చి2,, నంది పత్రిక** నల్లమల అటవీ ప్రాంతములో వెలసిన ఎగువ అహోబిలం నరసింహా స్వామి క్షేత్రంలోసోమవారం నాడు ఉదయం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం కార్య క్రమమును ఆలయ వేద పండితులువైభవంగా ప్రారంభ మయింది. ముందుగా రథంపై శ్రీ జ్వాలా నర సింహా స్వామి ని, చెంచులక్ష్మీ అమ్మవారి ఉత్సవవిగ్రహాలను కొలువు చేసిచెన్నై, బెంగుళూరు నగరాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన వివిధ రకాల పూల బాలలతో బంగారు ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలను ఆలయ అర్చక స్వాములు ప్రధానార్చకులు క్రీడాంబి వేణుగోపాల్ చేశారు. శ్రీ జ్వాలానరసింహస్వామి అమ్మవారి సమేతంగా రథం పై కొలువై భక్తులకు దర్శనభాగ్యంఇచ్చారు. దేవదేవుడి రథోత్సవం లోపాల్గొనడానికి రాష్ట్రము లోని నలుమూలల నుంచి వేలసంఖ్యలో భక్తులుతరలివచ్చారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవ ఉత్సవం ముఖ్యమైనదికావడంతో అశేష భక్త జనం వచ్చి రథోత్సవ కార్య క్రమాన్ని విజయ వంతం చేశారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించిన అనం తరం శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఆయనతో పాటు ఆళ్లగడ్డ సిఐలు. బి. వి. రమణ , యుగంధర్ పలువురు సి ఐ లు యస్ ఐ. లు పాల్గొన్నారు. ఈఉత్సవాలు 46 వ పీఠాధిపతి పర్యేక్షణలో అహోబిలందేవస్థానం సి ఏ ఓ రామానుజన్ స్వయంగారథోత్సవఏర్పాట్లనుపరిశీలించారు.





# ఆపద సమయాలలో రక్షణగా శక్తి యాప్



**మహానంది మార్చి 02 (నంది పత్రిక):–** ఆపద సమయాలలో శక్తి యాప్ రక్షణ కల్పిస్తుందని నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం పోలీసులు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్,వెంకటేశ్వర్లు,రఫీ, తెలిపారు. సోమవారం మహానంది మండల కేంద్రం తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్లో శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు,సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్ల ప్రాముఖ్యతను వివరించారు. మహిళ ఉపాధ్యాయులకు శక్తి యాప్ డౌన్లోడ్ చేయించారు. అత్యవసర సమయాలలో శక్తి యాప్ నెంబర్ 7993485111, చైల్డ్ వెల్ఫేర్ నెంబర్ 1098 , సైబర్ క్రైమ్ 1930,ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మణరావు,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయునిలో అతిథి వసతి గృహ నిర్మాణమునకు ఒక లక్ష విరాళం..!

## -ఆలయ ఈవో యం. రామక్రిష్ణ.



**ఎస్.కొత్తూరు. మార్చి 02 . (నంది పత్రిక ):** ప్రముఖ శైవక్షేత్రం లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నందు భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న అతిథి వసతి గృహ నిర్మాణమునకు ఒక లక్ష నూటా పదహారు రూపాయలు సోమవారం భక్తులు విరాళంగా సమర్పించినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. శిరివెళ్ళ మండలం గోవింద పల్లె గ్రామానికి చెందిన కీ"శే" పెడకంటి బాల సుబ్బయ్య జ్ఞాపకార్థం సతీమణి లక్ష్మీదేవి కుమారుడు సురేంద్ర, సందీప్ కుమార్ వీరి కుటుంబ సభ్యులకు స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా 1 లక్ష 116/- లు విరాళంగా సమర్పించారు. వారికి ఆలయ మర్యాదతో అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి ప్రసాదము, స్వామివారి చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు నారాయణ శర్మ, సురేష్ శర్మ ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాతన్‌పల్లి కేసులో బాల్క సుమన్‌కు బెయిల్

క్యాతన్‌పల్లి కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్ మంజూరయ్యింది. కోర్టు రూ. 25వేల పూచీకత్తుతో, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సోమవారం ఉదయం బాల్క సుమన్ కస్టడీ పిటిషన్‌ను వాయిదా వేసిన కోర్టు సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ బాల్కసుమన్‌కు బెయిల్ రాకుండా అడుగడుగునా అడ్డుపడింది. బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పోలీసులతో జిల్లా కోర్టులో అప్పీల్ చేయించింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన జిల్లా కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఇక బెయిల్ పిటిషన్‌పై లంచ్ తర్వాత తీర్పును వెల్లడించింది.

# నంద్యాలలో 11 వ జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలు



**నంద్యాల ప్రతినిధి. మార్చి 02 . (నంది పత్రిక ):**అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్వర్గీయ జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యం. ఆర్. గోవింద రెడ్డి గారు, మరియు స్వర్గీయ రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత ఆర్. సి. కంభగిరి రాజు గారు చిత్రకళ లో చేసిన సేవలకు వారి జ్ఞాపకర్థం గా 11 వ నంద్యాల జిల్లాస్థాయి పోటీలను ప్రముఖ చిత్రకారులు చిత్తులూరి రామ్ ప్రసాద్, చింతలపల్లె కోటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. వారు మాట్లాడుతూ నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల లోని వివేకానంద ఆడిటోరియం ఈ నెల 8వ తేది ఆదివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పోటీలు జరుగుతాయని అన్నారు. స్వర్గీయ "భారతరత్న "సంగీత విద్వాంసురాలు యం.ఎస్. సుబ్బలక్ష్మి గారి చిత్రాన్ని వేయవలసి ఉంటుంది. పోటీకి 5 నిముషాలు ముందుగా మేము ఇచ్చిన యం. ఎస్. సుబ్బలక్ష్మి గారి చిత్రాన్ని చూసి వేయాలి. ఈ పోటీలకు 7,8,9,10 వ తరగతి విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని అన్నారు. ప్రథమ బహుమతి 1 గ్రాము ప్యూర్ బంగారు పతకం,ద్వితీయ బహుమతి 15 గ్రాముల వెండి పతకం,తృతీయ బహుమతి 10 గ్రాముల వెండి పతకం అంతే కాకుండా 10 మందికి స్పెషల్ జ్యూరి బహుమతులు వుంటాయి. పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్స్ అందజేస్తారు. ప్రవేశ రుసుము 50 రూపాయలు. గవర్నమెంట్ స్కూల్స్, మున్సిపల్, ఎయిడెడ్ స్కూల్స్ కు 20 రూపాయలు మాత్రమే. చిత్ర లేఖన పోటీలో విద్యార్థులకు డ్రాయింగ్ షీట్స్ మాత్రమే అందజేయబడును. రంగులు, పెన్సిల్స్ వంటి సామాగ్రిని విద్యార్థులే తెచ్చుకోవాలి. మరిన్ని వివరాలకు సీతారాం ఆర్ట్ గారి సెల్ 9866760490 ఫోన్ చేసి తెలుసుకొనవచ్చును.

# మార్చి 5న పి4 జాబ్ మేళా.

## కమిషనర్ ఎన్. మౌర్య.



**తిరుపతి చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** పి4 కార్యక్రమం లో భాగంగా మార్చి 5న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అనైడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సంయుక్తంగా జీవకోన లోని విశ్వం స్కూల్ నందు 5వ తేదీ ఉదయం 9గంటల నుండి నిర్వహించనున్నామని తెలిపారు.

**ఉద్యోగ వివరములు :** 1. హై స్కూల్ టీచర్ – దీ.జు.ల (ప్రాధాన్యత)2. ప్రీ-ప్రైమరీ టీచర్ – ఏదైనా డిగ్రీ3. హాస్టల్ వార్డెన్ ఏదైనా డిగ్రీ 4. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (స్త్రీ=పు) – మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగిన ఏదైనా డిగ్రీ 5. ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ – కంప్యూటర్ పరిజ్ఞానం మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగిన ఏదైనా డిగ్రీ 6. టెక్నికల్ పోస్టులకు కూడా ఇంటర్వ్యూలు నిర్వహించబడును.

**అర్హతలు:**వయో పరిమితి: 1835 సంవత్సరాలు. వేతన పరిమితి: రూ.15,000 నుండి రూ.50,000 వరకు నెలకు విద్యార్హత: ఇంటర్మీడియట్ నుండి పీజీ వరకు

**ముఖ్య సూచనలు:** ఉద్యోగం కోరుకునే బంగారు కుటుంబాల (దీఖ) అభ్యర్థులు నవీకరించిన బయోడేటా మరియు సంబంధిత సర్టిఫికేట్లతో హాజరుకావాలి. నమోదు కార్యక్రమం వేదిక వద్ద నిర్వహించబడుతుంది. బంగారు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకి ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనే అర్హత ఉంటుంది. కావున ఆసక్తి ఉన్న వారు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆ ప్రకటనలో తెలిపారు.

# అక్షరాంధ్ర ఫైనల్ పరీక్షకు శత శాతం హాజరయ్యేలా చూడాలి


**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం చీప్ బ్యూరో: మార్చి 2, నంది పత్రిక** జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాశ్యులుగా చేసే అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 04న నిర్వహించబడుతున్న ప్రీ ఫైనల్ పరీక్షకు, మార్చి 15న నిర్వహించే ఫైనల్ పరీక్షకు రిజిస్టర్ అయిన వారంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వెబ్ ఎక్స్ ద్వారా మాట్లాడుతూ ప్రీ ఫైనల్ నిర్వహణకు అవసరమగు ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇందుకు సంబంధించి పరీక్షా కేంద్రాలను గుర్తించాలని, ఇన్విజిలేటర్లను , మూల్యాంకనం చేసేందుకు సిబ్బందిని నియమించాలని తెలిపారు. పి.డి డి.ఆర్.డి.ఏ, మెప్మా పి.డి, డ్వామా పి.డి. లు రిజిస్టర్ అయిన వారందరినీ పరీక్షకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, అక్షరాంధ్ర నోడల్ అధికారి కె వి వి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు..

# ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ :

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** భీమవరం పట్టణంలో చినరంగనిపాలెం ఎం పి ఎల్ హైస్కూల్లో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహిస్తున్న విధానమును పరిశీలించారు. హాల్ టిక్కెట్లు, సిట్టింగ్ ఏర్పాట్లను, సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిబంధనలు అనుగుణంగా నిర్వహించాలన్నారు. మాస్ కాపీయింగ్ కు ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని హెచ్చరించారు. విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండాలని సూచించారు. అనుమానస్పంద వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద తిరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాలకు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని సమీపంలోని జిరాక్స్ షాపులను మూసివేయించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



# కోలుకోలేక వివాహిత మహిళ మృతి.

**కొత్తపల్లి - నంది పత్రిక :** ఎక్కువ మోతాదులో మాత్రలు మింగి అపస్మారక స్థితికి వెల్లి కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఓ వివాహిత మహిళ మృతి చెందిందని హెడ్ కానిస్టేబుల్ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన. వివరాల మేరకు మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన మంద రాజమ్మ (55) 2022 సంవత్సరంలో తన భర్త అయిన వెంకటేశ్వరరెడ్డి చనిపోయిన నాటినుంచి మానసింగా అనారోగ్యంతో భాదపడుతుంది. దీంతో మృతురాలి కూతురైన కేశవ రెడ్డిగారి హేమలత తల్లిని కర్నూలులోని ఓ మానసిక వైద్యుడి వద్ద చికిత్స చేయించింది. ఈ క్రమంలో మందులు వాడుతూ ఉండేదని తెలిపారు. గత నెల 25 వ తేది రాత్రి రాజమ్మ కూతురితో ఫోన్లో మాట్లాడి మందులు జాగ్రత్తగా వేసుకోమని చెప్పిందని వివరించారు. 26 వ తేదిన ఎంతకు రాజమ్మ ఇంటి నుంచి బయటి రాలేదు. గమనించిన చుట్టుప్రక్కలవారు తలుపులు తీసీ చూడగా ఆమె ఆపస్మారక స్థితిలో పడిఉంది. దీంతో వారు అంబులెన్స్లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని మామ వరసఅయిన మల్లెల సుబ్బారెడ్డి ఫోన్చేసి హేమలతకు చెప్పాడని చెప్పారు. ఆమె ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యకోసం తల్లి రాజమ్మను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని చెప్పారు. అక్కడ వైద్యులు ఆమె ఎక్కువ మోతాదులో మాత్రలు వేసుకున్నదని తెలిపారన్నారు. అక్కడే చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయమై సోమవారం మృతురాలి కూతురు హేమలత పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవీంద్రబాబు తెలిపారు. కాగా మృతురాలికి కూతురుతోపాటు కొడుకు మల్లీకార్జున రెడ్డి ఉన్నాడని గత కొన్ని రోజులుగా అతడు శ్రీశైలం వెలుతున్నానని చెప్పి ఇంటినుంచి వెళ్లాడని ఆయన తెలిపారు.

# పుటాలమ్మ క్షేత్రంలో మొదలైన బ్రహ్మోత్సవాలు

## బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ గంగుల ప్రతాప్ రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 2 నంది పత్రిక** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రామ తీర్థ పుటాలమ్మ క్షేత్రములో శనివారం నుండి బ్రహ్మోత్స వాలు మొదలయ్యాయి. కలశ స్థాపన, ఉత్సవ ధ్వజారోహణ, చక్ర పెరుమాళ్ళ ఉత్సవం కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆదివారం సూర్యప్రభ చంద్రబాబు వాహనంలో స్వామివారు దర్శనమిచ్చారు. సోమవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం తదుపరి శేష వాహనం జరగనుంది. మంగళవారం దీక్షా హోమం, హనుమంతు వాహనం, బుధవారం దీక్ష హోమం ,పూర్ణాహుతి, గరుడోత్సవం, ఆదివారం వసంతోత్సవము శ్రీవారి పానుపు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవస్థానం వారి ఆధ్వర్యంలో మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండా మనోహర్ (మణి)బ్రహ్మోత్సవ కాలం నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. దేవస్థానం వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కార్యనిర్వహణాధికారి సాయి జయ చంద్రా రెడ్డి కోరారు. సోమవారం మాజీ పార్లమెంట్ సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి, యువ నాయకులు గంగుల భరత్ రెడ్డి లు పుటాలమ్మ క్షేత్రములో పూజలు నిర్వహించారు. వారితోపాటు నాసారి వెంకటేశ్వర్లు, అమర్ రెడ్డి, గంధం రాఘవరెడ్డిలు పాల్గొన్నారు.



# ఏకీకృత కుటుంబ సర్వే రానున్న మూడు పని దినాలలో నూరు శాతం పూర్తి చేయాలి.

**అక్షరాంధ్ర అభ్యాసకులు మార్చి 4వ తేదీన జరిగే పరీక్షకు నూరు శాతం హాజరు కావాలి.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**



**భీమవరం చీఫ్ బ్యూరో మార్చి 2నంది పత్రిక** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సోమవారం ఏకీకృత కుటుంబ సర్వే ప్రగతి పై ఎంపీడీవోలు, జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బందితో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గూగుల్ మీట్ ద్వారా మండలాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏకీకృత కుటుంబ సర్వే బుధవారం సాయంత్రం నాటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. యు.ఎఫ్ సర్వేపై నిరంతరం వీడియో కాన్ఫరెన్స ద్వారా సమీక్షిస్తున్న సర్వేలో ప్రగతి సాధించకపోవడంపై కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కూడా మండలాలలో పర్యటించి యు ఎఫ్ సర్వే పై సమీక్షిస్తున్ననన్నారు. పది పనిదినాలలో పూర్తి చేయవలసిన పనిని రెండున్నర నెలలు సాగదీయడం పట్ల కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యుఎఫ్ సర్వే లక్ష్య సాధనలో 25% పైబడి వెనుకబడి ఉన్న పాలకోడేరు, ఆకివీడు, భీమవరం, యలమంచిలి, పెనుమంత్ర మండలాల ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బుధవారం సాయంత్రం నాటికి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. సిబ్బందితో నేరుగా మాట్లాడి ఉదయం 7.00 గంటల నుండి సర్వే ప్రారంభించి సాయంత్రం వరకు కొనసాగిస్తే మంచి ప్రగతి కనపడుతుందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కేవైసీ ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మార్చి 4వ తేదీన అక్షరాంధ్ర అభ్యాసకులకు నిర్వహించే పరీక్షలకు నూరు శాతం హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆన్లైన్లో డేటా నమోదు చెయ్యాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ గూగుల్ మీట్లో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డ్ అధికారి వై. దోసి రెడ్డి, జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంఎస్ జి ఒ లు, సచివాలయ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని అసిస్టెంట్ లైన్ మాన్.. మృతి

**స్వల్ప గాయాలతో బయటపడ్డ లైన్ మాన్ తిరుపతయ్య**



**ఆళ్లగడ్డ (చాగలమర్రి), ప్రతినిధి మార్చి 2 నంది పత్రిక** చాగలమర్రి మండల పరిధిలోని పెద్ద భోదనం గ్రామ సమీపంలో బైక్ పై వెళుతున్న విద్యుత్ సిబ్బందిని సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొంది. వివరాల మేరకు విద్యుత్ లైన్ మాన్ తిరుపతయ్య, అసిస్టెంట్ లైన్ మెన్ ప్రసాద్ రెడ్డి ఇరువురు రాంపల్లి గ్రామానికి సబ్ స్టేషన్ తనిఖీ చేయడానికి వెళుతుండగా వెనుక నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొని కింద పడిపోయారు. ప్రసాద్ రెడ్డి (45 సం)సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. తిరుపతయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానిక గ్రామస్తులు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# పిజిఆర్ఎస్ లో అందిన ప్రతి వినతిని అధికారులు ఓర్పుతో చదివి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి







**అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన పరిష్కారం చూపాలి.**

**నేడు పి జి ఆర్ ఎస్ లో 179 దరఖాస్తులు... రెవెన్యూ క్లినిక్ లో 32 దరఖాస్తులు స్వీకరణ.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**

**భీమవరం చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ పీజీ ఆర్ఎస్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డి ఆర్ ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి కెసిహెచ్ అప్పారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులకు నేరుగా తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పీజీ ఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి వినతిని ఓర్పుతో చదివి సంబంధిత శాఖల అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాలు చుట్టూ తిరగకుండా నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిపాలనలో ప్రజా సమస్యల పరిష్కారం ప్రాధాన్యత గల అంశం అని, ఫిర్యాదుల పరిష్కారములో ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం లబ్ధిదారులు సంతృప్తి స్థాయి పెరిగే విధంగా ఉండాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే అందుకు గల కారణాన్ని లబ్ధిదారులకు అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్, ఆర్డబ్ల్యు ఎస్, ఆర్టీసీ సంబంధిత శాఖలకు సంబంధించి సమస్యలపై ఐ వి ఆర్ ఎస్ కాల్స్ ద్వారా ప్రజలు తెలియజేసే స్పందన పాజిటివ్ గా ఉండే విధంగా సమస్యల పరిష్కార చర్యలు ఉండాలన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నేడు భూ సంబంధిత సమస్యలు, కొత్తగా వికలాంగ, వితంతు పెన్షన్లు, గృహ నిర్మాణం, ఇళ్ళు మంజూరు, సీనియర్ సిటిజన్స్ సమస్యలు, ఆరోగ్య అంశాలకు సంబంధించిన వివిధ సమస్యలపై ప్రజల నుండి పలు ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ రోజు అందిన అర్జీలలో కొన్ని పిర్యాదులు ఈ విధంగా ఉన్నాయి. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ఇవ్వల సత్యనారాయణ అర్జీ సమర్పిస్తూ, వేల్పూరు గ్రామంలో తనకు 40 సెంట్లు వ్యవసాయ భూమి ఉందని, ఆడంగల్ నందు గడ్డి భూమిగా నమోదయిందని, మా పొలాన్ని రెగ్యులర్ ఖాతాగా మార్పు చేసి మా పేరును పాస్ బుక్ ఇప్పించాలని కోరారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామానికి చెందిన సోడదాసి లీలమ్మ అర్జీ సమర్పిస్తూ, తన భర్త అనారోగ్య కారణంగా మరణించారని, మాకు ఇంతవరకు రేషన్ కార్డు మంజూరు కాలేదని, రేషన్ కార్డు కొరకు పంచాయతీ కార్యాలయానికి తిరిగిన సమాధానం చెప్పడం లేదని, దయచేసి రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ 18వ వార్డుకు చెందిన ఈర్లపాటి మంగ అర్జీ సమర్పిస్తూ, నా ఇంటి స్థలంలో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ స్తంభాలు పాతారని, దీనివల్ల ఇంటి నిర్మాణం చేసుకోవడానికి వీలు లేకుండా పోయిందని, స్తంభాలను తొలగించవలసిందిగా తాడేపల్లిగూడెం పిజిఆర్ఎస్లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, దయచేసి విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరారు. ఉండి మండలం,చెరుకువాడ గ్రామానికి చెందిన బొ ద్ర నాగ వెంకట శివశంకర్ తాను మానసిక వికలాంగుడునని, 75% వికలాంగత్వం ధ్రువీకరణ పత్రం ఉందని, వైద్య ఖర్చులకు, జీవనోపాధికి చాలా ఇబ్బంది పడుతున్నానని, దయచేసి వికలాంగ పింఛను మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. భీమవరం మండలం, జొన్నలగరువు గ్రామానికి చెందిన గోరం చిన్న సామేలు 62 సంవత్సరములు మూడు సంవత్సరములు క్రితము గుండె ఆపరేషన్ జరిగినదని, ఏ విధమైన ఆదాయము లేదని, వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన కూనిసేట్టి నాగలక్ష్మి అర్జీ సమర్పిస్తూ విస్సా కోడేరు గ్రామంలో 1.85 సెంట్ల వ్యవసాయ భూమి ఉందని రిసర్వే లో 10 సెంట్లు భూమి తక్కువగా నమోదు అయిందని, తిరిగి సర్వే చేయించి తగ్గిన 10 సెంట్ల భూమి తనకు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వృద్ధుల సంక్షేమ అప్పీల్లేట్ ట్రిబ్యునల్ మెంబెర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పెట్రోల్ దాడిలో యువకుడు దిలీప్ మృతి

## పోలీసుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**పోరుమామిళ్ల /కాసినాయన మార్చి 2 ( నంది పత్రిక ):** కాశినాయన మండలం గంగన్నపల్లె హరిజవాడకు చెందిన కందుల దిలీప్ (24)పై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడిన దిలీప్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.నిందితులను ఇప్పటికీ గుర్తించకపోవడం, అరెస్టులు జరగకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దిలీప్కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు, గ్రామస్తులు ఈరోజు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డెక్కారు.ఈ ఆందోళనతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దిలీప్ మృతి కేసులో వెంటనే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.

# పి జి ఆర్ ఎస్ లో అందిన ఫిర్యాదు పై తక్షణమే స్పందించి, స్వీట్ షాప్ తనిఖీకి ఆదేశించిన: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** పీజీఆర్ఎస్ నందు ఈరోజు అందిన పిర్యాదు మేరకు జయ శ్రీ స్వీట్స్ & బేకరిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీచేసి పిర్యాదుదారులు సమక్షములో స్వీట్స్ ను శాంపిల్ తీసి స్టేట్ ఫుడ్ లాబరేటరీ కి పంపడం జరిగినది. తదుపరి ఆ శాంపిల్ యొక్క రిపోర్ట్ వచ్చిన తర్వాత చర్య తీసుకోవడం జరుగును జిల్లా ఆహార భద్రత అధికారి తెలియచేయడం జరిగినది.





# 2027లో జరగవలసిన గోదావరి పుష్కరాలకు సంబంధించి మౌలిక వసతులు ఏర్పాటుకు చేపట్టవలసిన పనులపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలను జారీ



## జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** సోమవారం కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ దేవాదాయ, పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, పోలీస్, ఫైర్, టూరిజం, ఆర్డబ్ల్యూఎస్, హెల్త్, గోదావరి హెడ్ వర్క్, ఆర్టీసీ, ఫిషరీస్ ట్రాన్స్కో, ఫిషరీస్, మున్సిపల్, తదితర శాఖల, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పుష్కరాల ఏర్పాటులో భాగంగా ప్రజలకు నేరుగా ఉపయోగపడే అత్యవసరమైన, లేదా అవసరమైన పనులుకు మాత్రమే అంచనాలు సిద్ధం చేయాలని ప్రాధాన్యత లేని పనులను ప్రతిపాదనలలో చేర్చవద్దని సూచించారు. ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించవలసిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. ప్రత్యేకంగా ఘాట్స్ అభివృద్ధి త్రాగునీరు, పారిశుద్ధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్, సరఫరా రహదారి మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా, ఏర్పాటు సుందరీకరణ, వంటి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు పైనే దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతి ప్రతిపాదనలో అవసరాన్ని స్పష్టంగా వివరించి సాంకేతికంగా పరిశీలించి మాత్రమే అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అంతేకాకుండా శాఖల వారీగా ప్రాధాన్యత క్రమంలో పనులు జాబితా తయారుచేసి ఖర్చులు వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. పనులు అమలలో పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కాలపరిమితిలో పూర్తిచేసి విధంగా కార్య చరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. పుష్కరాలకు లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందిని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్య ప్రకాష్, డి ఎం అండ్ హెచ్ ఓ జి.గీతాబాయి, జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి.ఉషారాణి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాస్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, కలెక్టరేట్ డిప్యూటీ తహసిల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# శబ్ద, వాయు కాలుష్యాన్ని నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

**జాతరలు, వేడుకలు, దేవాలయాలు, ఆసుపత్రులు వద్ద పెద్ద శబ్దాలతో సౌండ్ సిస్టం వినియోగించరాదు, బాణాసంచా కాల్చరాదు.**

**ఏకీకృత కుటుంబ సర్వే, ఈకేవైసీ వేగవంతంగా పూర్తి చేయాలి.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం లో సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శబ్ద, వాయు కాలుష్యం, ఏకీకృత కుటుంబ సర్వే, ఈ కేవైసీ, ఈపిటిఎస్ ఫైల్స్ అప్లోడింగ్ తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతరలు, ఉత్సవాలు, వేడుకలు, దేవాలయాలు, ఆసుపత్రుల వద్ద బాణాసంచా కాల్చకుండా రెవిన్యూ, పోలీస్, దేవాదాయ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సాంప్రదాయ పండుగ అయిన దీపావళి మినహా ఎక్కడ కూడా బాణాసంచా కాల్చకూడదు అన్నారు. శబ్ద, వాయు కాలుష్యం ద్వారా ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. బాణాసంచా కాల్చడం ద్వారా వచ్చే శబ్ద, వాయు కాలుష్యం వల్ల వృద్ధులు, రోగులు, పసి పిల్లల ఆరోగ్యం పై దాని ప్రభావం పడుతుందన్నారు. అదేవిధంగా మార్చి, ఏప్రిల్ మాసాలలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా విద్యార్థుల చదువుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా చదివి పరీక్షలు రాసేలా అందరూ, ముఖ్యంగా తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఎక్కడైనా బాణాసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో బాణాసంచా తయారీకి ఏ ఒక్కరికి అనుమతి లేదని, అనధికారకంగా తయారు చేస్తే తీవ్ర కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శబ్ద, వాయు కాలుష్య నివారణకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేసవి దృష్ట్యా ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండవలసిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఏకీకృత కుటుంబ సర్వే, ఈ కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈపిటి ఎస్ ఫైల్స్ అప్లోడింగ్ పై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా దేవాదాయ శాఖ అధికారి హరి సూర్య ప్రకాష్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి. శ్రీనివాసరావు, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పిడి కే సి హెచ్ అప్పారావు, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత అంశం



## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం చీఫ్ బ్యూరో: మార్చి 2, నంది పత్రిక** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల సాధికారతకు మరింత బలం చేకూర్చే దిశగా మార్చి 2 నుండి మార్చి 20 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మహిళా సాధికారత కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత అంశమని తెలిపారు. మహిళల ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై సమాజంలో విస్తృత అవగాహన అవసరమని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, డిఆర్డిఏ, మెప్మా, విద్యా శాఖ, కార్మిక శాఖ, స్కిల్ డెవలప్మెంట్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా మహిళల మానసిక ఆరోగ్యం పరిరక్షణ, గృహ హింస నిరోధం, మహిళా హక్కులపై అవగాహన, ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, రుణ మేళాలు, సైబర్ సెక్యూరిటీపై జాగృతి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రధానమంత్రి మాతృ వందన యోజన వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ర్యాలీలు,



ఇంటరాక్టివ్ సెషన్లు, ప్రత్యేక శిబిరాలు, “కుకింగ్ ఫర్ మెన్” వంటి సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలం, పట్టణ స్థాయిలో కార్యక్రమాలు ఫలప్రదంగా జరిగేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, డిఆర్డిఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్ అప్పారావు, డీఎంఅండ్హెచ్ఓ జి.గీతాబాయి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు..

# దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన లిఫ్ట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం చీఫ్ బ్యూరో మార్చి 2 నంది పత్రిక** కలెక్టరేట్లో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ ను సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుండి కలెక్టరేట్ కు అర్జీల సమర్పించేందుకు వస్తుంటారని, ముఖ్యంగా ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ కు వందలాదిమంది వినతి పత్రాలు సమర్పించేందుకు వస్తున్నారన్నారు. ప్రతిరోజు వివిధ మండలాల నుండి కలెక్టరేట్లో జరిగే సమావేశాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు రావడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పై అంతస్థకు రావడానికి కొంతమంది ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధుల పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని లిఫ్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరమైన వారు లిఫ్ట్ వినియోగించుకోవాలని కోరారు. ఈ లిఫ్ట 10 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు

# పీఎం శ్రీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అందిస్తున్న అదనపు బోధన వనరులను విద్యార్థులు వినియోగించుకోవాలి

## జాయింట్ సెక్రెటరీ హేమ జైస్వాల్

## పీఎం శ్రీ కార్యక్రమం జాతీయస్థాయిలో విద్య నాణ్యతను మెరుగుపరిచే కార్యక్రమం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**ఆకివీడు: చీఫ్ బ్యూరో మార్చి 2, నంది పత్రిక** పీఎం శ్రీ పాఠశాలల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అదనపు బోధన వనరులను విద్యార్థులు సమర్థంగా వినియోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పీఎం శ్రీ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ టు ఏపీ మరియు ఎఫ్సీఐ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ జాయింట్ సెక్రటరీ హేమ జైస్వాల్, సూచించారు. ఆకివీడు పులవర్తి లక్ష్మణస్వామి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని శ్రీ స్వామి వివేకానంద కళావేదిక నందు ఎంఈఓలు, హెడ్మాస్టర్లతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీఎం శ్రీ నిధులతో ఏర్పాటు చేసిన ల్యాబ్లను పరిశీలించి, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రశంసించారు. పీఎం శ్రీ అమలులో ఆకివీడు జిల్లా పరిషత్ పాఠశాల పనితీరును అభినందించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రెటరీ హేమ జైస్వాల్ మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలల ద్వారా అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు సమాజంలో స్పష్టమైన మార్పును తీసుకురాగలరని పేర్కొన్నారు. విద్య కేవలం మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా ఆత్మవిశ్వాసం, విలువలు, ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల్లో ఏర్పడే సానుకూల మార్పును సమాజం మాత్రమే కాదు, వారి కుటుంబాలు కూడా గమనిస్తారని తెలిపారు. విద్యార్థులు పొందిన జ్ఞానాన్ని ప్రదర్శించి తమ ప్రతిభను వెలికితీయాలని, సంపూర్ణంగా కాకపోయినా నిరంతర ప్రయత్నం చేస్తే జీవితంలో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఒక విద్యార్థిని మంచి వ్యక్తిగా తీర్చిదిద్దడం ద్వారా మొత్తం కుటుంబం, తద్వారా సమాజం మరియు భవిష్యత్ తరాలు మార్పు దిశగా పయనిస్తాయని అభిప్రాయపడ్డారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వనరులు, మద్దతును సమర్థంగా వినియోగించుకోవాలని, ప్రతి విద్యార్థి తన సామర్థ్యాన్ని గుర్తించి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ పనితీరును నిరంతరం మెరుగుపరుచుకుంటూ సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పీఎం శ్రీ కార్యక్రమం జాతీయ స్థాయిలో విద్యా నాణ్యతను మెరుగుపర్చే కీలక కార్యక్రమమని తెలిపారు. జిల్లాలో ఫీల్డ్ స్థాయిలో 27 పీఎం శ్రీ పాఠశాలల్లో అమలు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత రేటు 67 శాతం, పురుషుల అక్షరాస్యత రేటు 73 శాతంగా ఉన్నప్పటికీ ఇంకా మెరుగుదలకు అవకాశముందని కలెక్టర్ అన్నారు. పీఎం శ్రీ పాఠశాలల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోందని, ఉన్నత పాఠశాలల్లో కెమిస్ట్రీ, ఫిజిక్స్, కంప్యూటర్ ల్యాబ్లు సహా ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల అనుభవాన్ని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యా శాఖ మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసి విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ రాజమండ్రి ఆర్జేడీ జి.నాగమణి, డీఈఓ ఇ. నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసి పి. శ్యామ్ సుందర్, పీఎం శ్రీ జిల్లా నోడల్ అధికారి వి.పుష్పాంజలి, ఎంఈఓ రవీంద్ర, హెడ్మాస్టర్ పారి నాయుడు, ఎంఈఓలు, హెడ్మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాగునీటి భద్రతకు భరోసా

**- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుతో రైతులకు భారీ ఊరట**

**- సీఎం చంద్రబాబు, మంత్రి రవికుమార్ లకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి, చీఫ్ బ్యూరో మార్చి 2: నంది పత్రిక** ఎప్పటినుంచో పెండింగ్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు గొప్ప ఊరట కలిగించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. మొత్తం 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను దశలవారీగా మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 6,593, ఎస్పీడీసీఎల్ పరిధిలో 11,926, ఈపిడీసీఎల్ పరిధిలో 27,594 కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు తన విజ్ఞప్తికి వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కనెక్షన్ల మంజూరుతో రైతులకు సాగునీటి భద్రత లభించి, పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో అనేక కారణాల వల్ల పెండింగ్లో ఉన్న దరఖాస్తులను ఇప్పుడు ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చి పరిష్కరించడం రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, సాగునీటి వనరులను మెరుగుపరచడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం తీసుకునే ప్రతి నిర్ణయం వారి భవిష్యత్తుకు భరోసా కలిగించే విధంగా ఉంటుందని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు.

# రాజ్యసభకు మరో రెండురోజులే గడువు

**వికారాబాద్ సభలో రాజ్యసభ ప్రస్తావన**

**సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక**

**సంఘ్వీని తమిళనాడునుంచి పంపాలని సూచన**

రాజ్యసభ నామినేషన్లకు మరో రెండు రోజుల గడువే ఉంది, ఈ రెండు స్థానాలను బలం రీత్యా కాంగ్రెస్ గెలచుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు అబ్యరథులను ఖరారు చేయలేదు. వికారాబాద్ వేదికగా జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అగ్రనేతలు మధ్య సోమవారం కీలక చర్చ జరిగిందని సమాచారం. సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయని బలమైన నేతలకు ఈ సీట్లు కేటాయించాలనే అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎంపీల రేసులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య పేర్లను ఈ సందర్భంగా వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించేలా పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ రాజ్యసభ సభ్యుల ఎంపికపై జరిగిన చర్చలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీని తమిళనాడు నుంచి రాజ్యసభకు పంపేందుకు తెలంగాణ నేతలు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. 2026, ఫిబ్రవరి 18వ తేదీన రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఆ జాబితాలో తెలంగాణ నుంచి 2 స్థానాలు ఖాళీ కానున్నాయి. బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ పదవులు ముగియనున్నాయి. వీరి పదవి కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీల ఎన్నిక అనివార్యమైంది. ÷రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల దాఖలు చేసే చివరి తేదీ: మార్చి 5 కావడంతో ఎంపిక త్వరగా చేయాలని ఒత్తిడి పెంచారు.

# చమురు ట్యాంకర్పై దాడి భారతీయ సిబ్బంది ఒకరు మృతి

గల్ఫ్ ఆఫ్ ఒమన్ లో ఓ చమురు ట్యాంకర్పై దాడి జరిగింది. డ్రోన్ బోట్తో ఈ దాడికి పాల్పడినట్లు ఒమన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ ఘటనలో నౌకలోని సిబ్బందిలో ఒకరు మృతిచెందారు. ఆ వ్యక్తి భారతీయుడని తెలిసింది. దాడికి గురైన నౌకను ఎంకేడీ వ్యోమ్గా గుర్తించారు. దీనిపై మార్షల్ ఐలాండ్స్ జెండా ఉంది. ఒమన్ తీరానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో ఈ నౌకపై దాడి జరిగిందని ఒమన్ మీడియా వెల్లడించింది. ఈ ఘటన కారణంగా నౌకలో భారీ పేలుడు సంభవించింది. ప్రధాన ఇంజిన్ రూమ్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.దీంతో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు ఒమన్ తెలిపింది. దాడి సమయంలో నౌకలో 59,463 మెట్రిక్ టన్నుల చమురు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ దాడి ఎవరు చేశారన్న దానిపై స్పష్టత లేదు. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడుల వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.నౌకలోని మిగతా 21 మంది సిబ్బందిని రక్షించి మరో కమర్షియల్ ఓడలోకి తరలించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com